

సిద్ధాపురం.. పునర్జీవం

> ఆత్మకూరు మండలాన్ని సస్యశ్యామలం చేసే సిద్ధాపురం ఎత్తిపోతల పథకం ఎట్టకేలకు తిరిగి ప్రాణం పోసుకుంటోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక మరమ్మతు పనులు ఆరంభించింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ ఎత్తిపోతల పథకం పూర్తి నిరాదరణకు గురైంది. కనీసం మట్టికట్టపై జంగిల్ క్లియరెన్స్ చేయలేదు. గుంతలను కూడా పూడ్చలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే యుద్ధప్రాతిపదికన ప్రాజెక్ట్ అభివృద్ధికి చర్యలు చేపట్టింది. రూ.9.99 లక్షల వ్యయంతో ఎడమ ప్రధాన కాల్వ తూము గేటు నుంచి ఒక కిమీ దూరం వరకు కాల్వలో పూడికతీత, కాల్వకు ఇరువైపుల గ్రావెల్ రోడ్డు పనులను చేపట్టనున్నారు.

- గత వైసీపీ పాలనలో అధ్వానంగా ప్రాజెక్ట్ నిర్వహణ
- కూటమి సర్కార్ హయాంలో యుద్ధప్రాతిపదికన చర్యలు
- ప్రస్తుతం జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తి

ఆత్మకూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు, పాములపాడు మండలాల్లోని సుమారు 21300 ఎకరాల పంట భూములకు రబీ సీజన్‌లో సిద్ధాపురం ఎత్తిపోతల పథకం సాగునీరు అందించేలా 2006 ఏప్రిల్ 20వ తేదిన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ఏళ్ల తరబడి అనేక అవాంతరాలతో ప్రాజెక్ట్ పనులు ముందుకు సాగలేదు. 2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఈ ప్రాజెక్ట్‌ను ప్రత్యేక చొరవ తీసుకుని పూర్తి చేయించారు. దీంతో ఎట్టకేలకు 2018 జనవరి 7వ తేదిన జాతికి అప్పట్లో సీఎం చంద్రబాబు జాతికి అంకితం చేశారు. ఈ పథకాన్ని తొలుత రూ.89.72కోట్ల వ్యయంతో నిర్మించాలని భావించినప్పటికీ అంచనాలు భారీగా పెరగడంతో రూ.116.52కోట్లు ఖర్చయింది. అయినప్పటికీ అప్పటి చంద్రబాబు ప్రభుత్వం అవసరమైన నిధులను మంజూరు చేసి ప్రాజెక్ట్‌ను పూర్తి చేశారు.



సిద్ధాపురం ఎత్తిపోతల పథకం



ప్రస్తుతం చెరువు కట్టపై జంగిల్ క్లియరెన్స్ జరగడంతో సుందరంగా కనిపిస్తున్న చెరువుకట్ట

సిద్ధాపురం ఎత్తిపోతల ప్రాజెక్ట్ స్వరూపం ఇలా

సిద్ధాపురం ఎత్తిపోతల పథకంలో భాగంగా 21300 ఎకరాలకు సాగునీరందించి ఆయకట్టును స్థిరీకరించాలని ప్రాజెక్ట్‌ను రూపొందించారు. ఇందులో ఆత్మకూరు మండలంలో 17950 ఎకరాలు, పాములపాడు మండలంలో 3350 ఎకరాల ఆయకట్టును నిర్దేశించారు. ప్రధానంగా వెలుగోడు జలాశయంలో 5.6టీఎంసీలకు నీటి నిల్వలకు తగ్గకుండా ఉన్నప్పుడే వీబీఆర్ నుంచి సిద్ధాపురం చెరువులోకి 200 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసేలా ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా స్టేజ్-1 పంప్‌హౌస్ నిర్మాణం చేపట్టి అక్కడి నుంచి రెండు భారీమోటార్ల ద్వారా (ఒక్కో మోటారు 100 క్యూసెక్కుల సామర్థ్యం) నీటిని 40 అడుగుల ఎత్తులో నిర్మించిన సర్జ్ ట్యాంక్‌లోకి ఎక్కిస్తారు. అక్కడి నుంచి గ్రావిటీ మీదుగా 6.750కిమీల దూరం అండర్ గ్రౌండ్ పైపులైన్ ద్వారా ప్రవహించి స్టేజ్-2 పంప్‌హౌస్‌లోకి చేరుతాయి. అక్కడ వున్న మరో రెండు భారీమోటార్ల ద్వారా నీటిని పంపింగ్ చేయడంతో 0.975కిమీల దూరంలో వున్న చెరువులోకి వీబీఆర్ జలాలు చేరుకునేలా ప్రాజెక్ట్‌ను నిర్మించారు. కాగా రెండు పంప్‌హౌస్‌లకు విద్యుత్ సరఫరా అందించేందుకు అండర్ గ్రౌండ్ కేబుల్ ద్వారా విద్యుత్ తీగలను ఏర్పాటు చేసి 33/11 రెండు పవర్‌స్టేషన్‌లను నెలకొల్పారు. వీటికి ఆత్మకూరు 132/33 విద్యుత్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా జరుగుతోంది.

ఐదేళ్ల వైసీపీ పాలనలో అధ్వానంగా ప్రాజెక్ట్ నిర్వహణ

2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక సిద్ధాపురం ఎత్తిపోతల పథకం ప్రాజెక్ట్ నిర్వహణ అధ్వానంగా మారింది. కనీసం ప్రాజెక్ట్ రెగ్యులర్ మెయింటెనెన్స్ నిధులను కూడా ఇవ్వకపోవడంతో సిద్ధాపురం పథకం నిర్వీర్యంగా మారింది. చెరువు కట్టంతా కంపచెట్లు పెరిగి ప్రమాదకర స్థాయికి చేరుకుంది. అదేక్రమంలో చెరువు కట్టపై కూడా గుంతలు ఏర్పడ్డాయి. అయితే కనీసం జంగిల్ క్లియర్ పనులు కూడా చేపట్టకపోవడంతో అడవిని తలపించేలా చెరువు కట్ట తయారైంది. ఈ క్రమంలోనే 2021 డిసెంబరు 5వ తేదిన ఎడమ ప్రధాన కాల్వ వద్ద చెరువు కట్టకు రంధ్రాలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఈ పరిస్థితుల్లో ఇరిగేషన్ అధికారులు అష్టకష్టాలు పడి నీటి లీకేజీలను అరికట్టారు. ఆ తర్వాత 2022 డిసెంబరు 15వ తేదిన ఎడమ ప్రధాన కాల్వ తూమ్ గేట్‌ను ఎత్తే క్రమంలో గేట్‌రాడ్ స్ట్రక్ అవ్వడంతో గేటు ఇనుప రేకులు సైతం వరిగిపోయాయి. దీంతో సుమారు 100 క్యూసెక్కుల మేర నీరు సమీప పంటపొలాల్లోకి చేరడంతో రైతులు నష్టపోయారు. ఆ సమయంలో చెరువులో పుష్కలంగా నీరు ఉండటం వల్ల గేట్లను మరమ్మతులు చేసేందుకు నానా ఇబ్బందులు పడ్డారు. చివరకు వరిగడ్డి, కర్రలను అడ్డుగా వుంచి నీటిప్రవాహాన్ని కట్టడి చేసే ప్రయత్నం చేశారు. అలాగే మూడు ట్రిప్పర్లలో స్టోన్‌డస్ట్‌ను తరలించి తూము ప్రవాహమార్గాన్ని తాత్కాలికంగా మూసివేసినప్పటికీ నీరు వృథా అవుతూనే వచ్చింది.

యుద్ధప్రాతిపదికన చర్యలు

ప్రస్తుతం కూటమి సర్కార్ అధికారంలోకి రావడంతో సిద్ధాపురం ఎత్తిపోతల పునర్జీవానికి చర్యలు చేపట్టింది. జలవనరుల శాఖ వద్ద కూడా పుష్కలంగా నిధులు లేకపోవడంతో ఎస్‌డీఎంఎఫ్ (రాష్ట్ర విపత్తుల నివారణ నిధి) ద్వారా ప్రాజెక్ట్ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా రూ.9.99 లక్షల వ్యయంతో 4.9కిమీల పొడవు గల చెరువు కట్టపై జంగిల్ క్లియరెన్స్ పనులతో పాటు చెరువు కట్టపై ఏర్పడిన గుంతలను పూడ్చివేసే పనులను పూర్తి చేశారు. అదేక్రమంలో మరో రూ.9.99 లక్షల వ్యయంతో ఎడమ ప్రధాన కాల్వ తూము గేటు నుంచి మొదలుకుని ఒక కిమీ దూరం వరకు కాల్వలో పూడికతీత పనులను చేపట్టడంతో పాటు కాల్వకు ఇరువైపు గ్రావెల్‌రోడ్డు పనులను చేపట్టనున్నారు. ఎత్తిపోతల పథకానికి విద్యుత్ సరఫరా అందించేందుకు ఏర్పాటు చేసిన అండర్ గ్రౌండ్ కరెంట్ కేబుల్ తరచూ మరమ్మతులకు గురవుతుండటంతో రూ.10కోట్లతో ఓవర్ హెడ్ కరెంట్ కేబుల్ ఏర్పాటుకు ప్రతిపాదనలను సిద్ధం చేశారు. ఇవే కాకుండా బ్రాంచ్ కెనాల్స్, ఫీల్డ్ కెనాల్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. కాగా ఈ ప్రాజెక్ట్‌కు అనుసంధానంగా వెంకటాపురం గ్రామ సమీపంలోని కుడి ప్రధాన కాల్వ నుంచి 6కిమీల దూరంలో వున్న ఇందిరేశ్వరం, శ్రీపతిరావుపేట గ్రామాల్లోని సుమారు 4500 ఎకరాలకు ఎత్తిపోతల జలాలను అందించేందుకు గతంలోనే సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. దీంతో ఈ పనులను కూడా చేపట్టేందుకు అధికారులు ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు.



చెరువు కట్టపై గుంతపూడ్చివేతతో సుగమంగా చెరువుకట్ట మార్గం



వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఎడమ ప్రధాన కాల్వ దుస్థితి ఇలా

ప్రాజెక్ట్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి

సిద్ధాపురం ఎత్తిపోతల పథకం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ఇప్పటికే ఎస్‌డీఎంఎఫ్ నిధుల ద్వారా చెరువు కట్టపై జంగిల్ క్లియరెన్స్, గుంతల పూడ్చివేత పనులను పూర్తి చేశాం. అలాగే ఎడమ ప్రధాన కాల్వలో పూడిక తీత పనులను చేపట్టి ఇరువైపుల రస్తా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇవేకాక రూ.10కోట్ల అండర్ కరెంట్ కేబుల్ లైన్‌కు బదులు ఓవర్ హెడ్ కరెంట్ లైన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాం. ఈ పనులన్నీ పూర్తయితే ప్రాజెక్ట్ నిర్వహణ కొంత మెరుగుపడే అవకాశం ఉంది.

- శివనాయక్, తెలుగుగంగ పథకం ఏఈ, నంద్యాల

నివేదికలు ఇవ్వండి - కలెక్టర్



నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు కలిగే నష్టాలను నివారించడానికి వ్యూహాత్మక ప్రణాళికలను సిద్ధం చేసేందుకు నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా విపత్తు నిర్వహణ ప్రణాళిక-నివారణ ముందస్తు జాగ్రత్త చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంశానికి సంబంధించి యాక్షన్ టేకన్ రిపోర్ట్ ఎప్పటికపుడు సంబంధిత అధికారులకు అందజేయాలన్నారు. ఉమ్మడి జిల్లాగా ఉన్న సమయంలో 2007, 2009లలో నంద్యాలలోని చామకాల్వకు వరదలు సంభవించి పట్టణం సాధారణ స్థితికి రావడానికి 17నుంచి 20రోజులు సమయం పట్టిందని, ప్రస్తుత పరిస్థితుల్లో అలాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే వాటి నివారణకు పకడ్బందీ చర్యలకు నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కందులు కొనాలి: జేసీ విష్ణు చరణ్

కొత్తపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కందులు కొనాలని నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ మార్క్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని దుద్యాల గ్రామ రైతు సేవా కేంద్రం వద్ద మద్దతు ధరపై నిర్వహిస్తున్న కందుల కొనుగోలు కేంద్రాన్ని జేసీ ఆకస్మిక తనిఖీ చేశారు. జేసీ తనిఖీలో భాగంగా పంట కొనుగోలుకు ఉండాల్సిన నాణ్యత ప్రమాణాలు, తేమ శాతం, చెడిపోయిన గింజలు తదితర వాటిపై జేసీ మార్క్‌ఫెడ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22 వరకు కందుల కొనుగోలు ప్రక్రియ ముగిసినప్పటికీ నందికొట్కూరు డివిజన్‌లో చాలా మంది రైతులు ఇంకా పంట కోతలు చేసుకుంటున్నారని, దీని వల్ల మే 30 వరకు కంది కొనుగోలు గడువును పొడిగిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ప్రకటించారు. కందుల మార్కెట్ ధర క్వింటం రూ.6,500 నుంచి రూ.6,800 వరకు ఉండటంతో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రూ.7,550 మద్దతు ధరతో జిల్లాలో 28 కంది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. జేసీ వెంట తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీవో మేరీ, ఏడీఏ ఆంజనేయ, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ హరినాథ్ రెడ్డి, ఎంపీపీ కిచ్చన్నగారి కుసుమలత, సర్పంచ్ శోభలత, ఏవో మహేష్, డీసీఎంఎస్ బ్రాంచ్ మేనేజర్ నవీన్ పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్షకు 139 మంది గైర్హాజరు

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో గురుకుల పాఠశాలల్లో 5,6,7వ తరగతుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్షకు 139 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈవో జనార్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ శుక్రవారం గురుకుల పాఠశాలల్లో 5.6.7వ తరగతులకు, ఇంటర్, డిగ్రీలో ప్రవేశాల కోసం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయన్నారు. 5,6,7 తరగతుల్లో ప్రవేశానికి 4 పరీక్షా కేంద్రాల్లో 836 విద్యార్థులకు గాను 697 మంది హాజరయ్యారన్నారు. ఇంటర్, డిగ్రీలో ప్రవేశానికి 8 పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా 1,923 మంది విద్యార్థులకు గాను 1,676 మంది హాజరయ్యారని తెలిపారు.



ప్రగతిలో రహదారి

- ఓర్వకల్లు పారిశ్రామిక ప్రగతిలో మరో అడుగు
- నాలుగు వరుసల రోడ్లకు రూ.207 కోట్లు
- నేషనల్ హైవేగా ఉప్పలపాడు, రామళ్లకోట, గుట్టపాడు రోడ్లు
- ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- ఇప్పటికే 2,612 ఎకరాల్లో రూ.2,786 కోట్లతో మౌలిక వసతులు

కర్నూలు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు పారిశ్రామిక ప్రగతి పరుగులు పెడుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి నిధులు రాబడుతోంది. హైదరాబాద్- బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ (హెచ్‌బీఐసీ)లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్ అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ఫేజ్-1 కింద 2,612 ఎకరాలలో రూ.2,786 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేసింది. పలు పరిశ్రమలు ఏర్పాటుకు సన్నాహాలు చేపట్టింది. రవాణా సౌకర్యాలపై శుక్రవారం నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులతో రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక వసతుల శాఖ బీసీ జనార్ధన్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్ పరిధిలో 32 కి.మీలు జిల్లా రహదారులను నాలుగు వరుసల రోడ్లు (4 లైన్ రోడ్స్)గా అభివృద్ధి చేయడం, రైల్వే లైన్ల ఏర్పాటుపై చర్చించారు. ఇప్పటికే వీటిపై ఎన్‌హెచ్‌ఏఐకు లేఖ కూడా రాశారు. ఉప్పలపాడు- ఉశేనాపురం, ఉప్పలపాడు-రామళ్లకోట, గుట్టపాడు-బ్రహ్మణపల్లి రోడ్లు నాలుగు వరుసల రహదారులుగా ఆధునీకీకరణ చేయనున్నారు.

నాలుగు లైన్ల రహదారులు

రాష్ట్రంలో జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులపై రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అధ్వర్యంలో 2వ టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్రంలో చేపట్టిన జాతీయ రహదారుల ప్రాజెక్టులు, కేంద్ర రోడ్లు, రవాణా, హైవే మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనులు వేగవంతం చేయడంపై ప్రధానంగా చర్చించారు. అందులో భాగంగానే హైదరాబాదు-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ (హెచ్‌బీఐసీ)లో భాగంగా కేంద్ర ప్రభుత్వం అభివృద్ధికి శ్రీకారం చుట్టిన ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్ పరిధిలో జాతీయ రహదారులు అభివృద్ధి, రైల్వే లైన్ అనుసంధానంపై ప్రధానంగా చర్చించారు.

మిగతా 4వ పేజీలో



ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్‌కు రైల్వే, ఎన్‌హెచ్, ఎయిర్‌పోర్టులు అనుసంధానం చేసే మ్యాప్

కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 2014-19 కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పారిశ్రామిక ప్రగతికి బీజం వేశారు. ఓర్వకల్లు కేంద్రంగా 33 వేల ఎకరాల్లో పారిశ్రామిక హబ్ ఏర్పాటు చేశారు. ప్రపంచంలోనే తొలి 1000 మెగావాట్ల అల్ట్రా మెగా సోలార్ యూనిట్ ఏర్పాటు చేశారు. జైరాజ్ ఇస్పాత్ స్టీల్ పరిశ్రమకు శంకుస్థాపన చేశారు. ప్రపంచంలోనే తొలి 3,680 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ఉత్పత్తి యూనిట్ పునాది రాయి వేశారు. అయితే 2019 మేలో వచ్చిన జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల పారిశ్రామిక ప్రగతి పడకేసింది. గతేడాది జూన్ 12న సీఎం చంద్రబాబు సారథ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం మళ్లీ కొలువుదీరడంతో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు మళ్లీ పూర్వవైభం వచ్చింది. హైదరాబాద్-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ (హెచ్‌బీఐసీ)లో భాగంగా ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టడం, భారీగా నిధులు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. హైదరాబాద్-బెంగళూరు మధ్యలో ఓర్వకల్లు ఉండడం, ఇక్కడ పుష్కలంగా ప్రభుత్వ భూమి ఉండడం కూడా కలసి వచ్చింది. ఇది దక్షిణ భారతదేశంలో రెండు ప్రధాన ఆర్థిక కారిడారులైన చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ (సీబీఐసీ), విశాఖపట్నం - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ (వీసీఐసీ) మధ్య అనుబంధంగా కూడా పని చేస్తుంది. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్‌ను దాదాపు 4,742 ఎకరాల్లో అభివృద్ధి చేయనున్నారు. జాతీయ రహదారి (ఎన్‌హెచ్)-40 నుంచి మూడు ప్రధాన రహదారులను అనుసంధానం చేస్తుంది. దీంతో ఓర్వకల్లును పారిశ్రామిక పరుగులు పెట్టించేందుకు సీఎం చంద్రబాబు ప్రత్యేక కృషి చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులు రాబట్టి మౌలిక వసతులు కల్పన, పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

బహిరంగ మద్యపానం చేస్తున్న 111మందిపై కేసు

నంద్యాల క్రైం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా బహిరంగ మద్యపానం చేస్తున్న వారిపై దాడులు చేసినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా శుక్రవారం తెలిపారు. బహిరంగ ప్రాంతంలో మద్యం సేవిస్తున్నవారిపై 111 కేసులు నమోదు చేశామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 26 మందిపై చర్యలు తీసుకున్నామన్నారు. మోటార్ వాహన చట్టం ఉల్లంఘించిన 194 మందిపై రూ.97,640 జరిమానా విధించామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 26 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే బహిరంగ మద్యపానం, జూదం, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేకంగా డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచామన్నారు. నిర్మానుష్య ప్రదేశాలు, తోటలు, పట్టణ, గ్రామ శివారు ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం సేవించేవారిపై డ్రోన్ కెమెరాలతో నిఘావేసి వాటివల్ల కలిగే అనర్థాలను ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై నజీర్

మలన్న సేవలో ప్రముఖులు

శ్రీశైలం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను శుక్రవారం రాజస్థాన్ పరిశ్రమలశాఖ సీఎండీ అరుషిమాలిక్, ఎంటీఆర్‌డీ కార్యదర్శి అద్రిజామంజరిసింగ్ దర్శించుకుని ప్రతేక పూజలు నిర్వహిచుకున్నారు. ఆలయ దర్శనార్థం వచిన వీరికి ఈఓ శ్రీనివాసరావు, వేదపండితులు, అర్చకులు రాజగోపురం వద్ద ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజలు అనంతరం అమ్మవారి ఆలయ ఆశీర్వచణ మండపంలో వేదపండితులు, వీరికి వేద ఆశీర్వచణం చేయగా అర్చకులు తీర్థ, ప్రసాదాలు అందించారు.


సౌత్ కొలనులో ఈత కొడుతున్న చిన్నారులు

వేసవిలో హాయిగా..

ఎండల నుంచి ఈత కొలను బిగ్ రిలీఫ్

డీఎస్‌డీఓ ఆధ్వర్యంలో శిక్షణ

ఆసక్తి చూపుతున్న నగర ప్రజలు

కర్నూలు స్పోర్ట్స్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండు ఎండలో హాయిగా.. చల్లగా ఈతకొలనుకు వెళ్లాలనిపిస్తుంది. స్విమ్మింగ్ వేసవి ఉపశమనానికే కాకుండా, ఆరోగ్యదాయకం కూడా. పిల్లలు పెద్దలు అనే తేడా లేకుండా అందరూ ఈత కొలనుకు వెళితే ఆరోగ్యం సొంతమైనట్లే. కర్నూలు నగరంలో హంద్రీనది పక్కన కిసాన్ ఘాట్ వద్ద 1972లో ఈతకొలను ఏర్పాటు చేశారు. ఇక్కడ వందలు, వేల సంఖ్యలో రాష్ట్ర, జాతీయ స్థాయి స్విమ్మర్లు రాణించారు. భానుడి ప్రతాపంతో అల్లాడిన ప్రజానీకానికి ఈతకొలను తన ఒడిలో ఉపశమనం పొందమని ప్రత్యేక ఆహ్వానం పలుకుతుంది. గతంలో ఉన్న ఈత కొలను సామర్థ్యం దాదాపు 24 లక్షల లీటర్లు. ప్రస్తుతం 17 లక్షల సామర్థ్యానికి కుదించారు. దీంతో ప్రమాదాలు జరగవని క్రీడల అభివృద్ధి అధికారి బి.భూపతిరావు తెలిపారు. గతం కంటే కొలను లోతును మూడు అడుగులు తగ్గించారు. దీని వల్ల ఈత నేర్చుకునే వారికి సౌకర్యంగా ఉంటుంది. కోచ్‌తో పాటు క్రీడా సంస్థ ఉద్యోగులు ఈత నేర్చుకోనివారిని అనునిత్యం కనిపెట్టుకుని ఉంటారు. 10 సంవత్సరాల విద్యార్థుల కోసం లిటిల్ ఈతకొలను నిర్వహిస్తున్నట్లు భూపతిరావు తెలిపారు. వేసవిలో రద్దీని అనుగుణంగా అదనంగా పది మంది శిక్షకులను నియమించాలి.

ఫీజు వివరాలు

జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ స్విమ్మింగ్‌పూల్‌లో నామమాత్రపు ఫీజు వసూలు చేస్తారు. ఈతకొలను మెయింటేన్స్ కోసం వాటిని వినియోగిస్తున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. 14 సంవత్సరాల బాలబాలికలకు ప్రత్యేక రుసం రూ.500 (అడ్మిషన్) ప్రతి నెల రూ.500 చెల్లించాలి. 14 సంవత్సరాలు పైబడిన వారు ప్రవేశ రుసుం రూ.1000, అలాగే ప్రతి నెలకు రూ.1000 చెల్లించాలి. సభ్యత్వం లేని వారు గంటకు రూ.100 చెల్లించాలి.

స్విమ్మింగ్ సమయాలు

ఉదయం 6 గంటల నుంచి 6:45 గంటల వరకు మొదటి బ్యాచ్, రెండో బ్యాచ్ 7 నుంచి 7:45 గంటల వరకు మూడో బ్యాచ్ 8 నుంచి 8:45 గంటల వరకు ఉంటుంది. సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు ఉంటుంది. మహిళలు ఈత నేర్చుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

దరఖాస్తు ఇలా..

ఈత కొలను వద్ద కానీ, జిల్లా క్రీడా సంస్థ కార్యాలయంలో కానీ రూ.20 చెల్లించి దరఖాస్తు ఫారం తీసుకోవాలి. పూర్తి చేసిన దరఖాస్తుతో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ప్రభుత్వ వైద్యుడు నిర్ధారించిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను అందజేయాలి. దరఖాస్తులో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల సంతకం తప్పనిసరి. స్విమ్మింగ్ పూల్‌ను ప్రతిరోజూ జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు పర్యవేక్షిస్తుంటారు. వేసవిలో ప్రతిరోజు వెయ్యి మందికి పైగా పాల్గొంటారని అంచనా వేశారు.

విద్యార్థులూ.. వేసవిలో ఈత నేర్చుకోండి



విద్యార్థులు వేసవిలో ఈత నేర్చుకోడానికి తల్లిదండ్రులు కూడా సహకరించాలి. అదనంగా 10 మంది స్విమ్మింగ్ లైఫ్ సేవర్స్‌ను వినియోగించుకుంటాం. కోచ్ మంచి శిక్షణ ఇస్తున్నారు. ఈత ఆరోగ్యానికి మంచిది. భవిష్యత్తులో స్విమ్మర్లను తయారు చేస్తాం.

– డీఎస్‌డీఓ భూపతిరావు




లర్నింగ్ చిన్నకొలనులో ఈత నేర్చుకుంటున్న చిన్నారులు


నార్త్ కొలనులో సెంటరు కొలనులో ఈత నేర్చుకుంటున్న చిన్నారులు

ఔటర్ రింగ్ రోడ్డుకు
భూమిని సేకరించండి


మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ విక్రాంత్‌పాటిల్

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కోడుమూరు మండలంలోని పెద్దపాడు నుంచి హైదరాబాదు ఎన్‌హెచ్‌కు లింక్ చేస్తూ ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పాటుకు సంబంధించిన భూసేకరణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ రంజిత్ బాషా కర్నూలు మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి జిల్లా కలెక్టర్ డిస్ట్రిక్ట్ రోడ్డు సేఫ్టీ కమిటి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఎంట్రన్స్, పార్కింగ్ ఏర్పాటు అంశాలపై వేగవంతంగా చర్యలు తీసుకోవాలని హాస్పిటల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌ను ఆదేశిం చారు. ఎల్లమ్మ తల్లి గుడి దగ్గర అప్రోచ్ రోడ్డు కొరకు భూసేకరణ చేసి ఇచ్చి నెల అవుతుందని, అప్రోచ్ రోడ్డు పనులు వెంటనే మొదలు పెట్టాలన్నారు. ఆటోలో, సొంత వాహనాలలో కెపాసిటీకి మించి ఎక్కించుకుని ప్రయాణం చేసే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డీటీసీను ఆదేశించారు. రాళ్లదొడ్డి వద్ద రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి ఎస్‌హెచ్ ప్లాన్ కింద రూ.కోటి మంజూరయ్యాయని, వాటికి టెండర్లు పిలుస్తున్నామనీ ఆర్‌అండ్‌బీ ఎస్ఈ కలెక్టర్‌కు వివరించారు. ఎన్‌హెచ్, కడప పరిధిలో 16 బ్లాక్ స్పాట్‌లను గుర్తించడం జరిగిందని రూ.118లక్షలతో పనులు చేపడుతున్నామనీ, 60 రోజుల్లో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఎన్‌హెచ్ పీడీ, కడప కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ రామచంద్రారెడ్డి, డీటీసీ శాంతకుమారి, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ఏవో సింధూ సుబ్రహ్మణ్యం, నేషనల్ హైవే పీడీలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం కోసం శ్రమిస్తున్న చంద్రబాబు

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి


చంద్రబాబు నాయుడు చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న గౌరు చరితారెడ్డి, పత్తి ఓబులయ్య

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కొనసాగుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు 75వ జన్మదిన వజ్రోత్సవ సాంస్కృతిక వారోత్సవాల్లో శుక్రవారం 'శాస్త్రీయ, జానపద, సినీ నృత్య లహరి' ప్రదర్శనలు, 'కళాకారులకు సత్కారాలు' నిర్వహించారు. ముందుగా చంద్రబాబు నిలువెత్తు ఫ్లెక్సీ చిత్రపటానికి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య క్షీరాభిషేకం చేశారు. అనంతరం జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓర్వకల్లులో ఇప్పటికే అనేక పరిశ్రమలు వచ్చాయని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని పరిశ్రమలు జిల్లాల్లో ప్రారంభమవుతాయన్నారు. అందుకు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ కృషి చేస్తున్నారని అన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, కళారత్న పురస్కార గ్రహీత పత్తి ఓబులయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కర్నూలు నగరంలో చంద్రబాబు జన్మదిన వజ్రోత్సవ సాంస్కృతిక వారోత్సవాలు వారం రోజుల పాటూ కన్నుల పండువగా నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని అన్ని రంగాల వారికి ప్రోత్సాహకాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నృత్య గురువులు నారాయణస్వామి, ఎస్.కరీముల్లా, రోహిత్, నాగసాయి ప్రదీప్‌లను, భానుస్వామిలను ఎమ్మెల్యే సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాక్షేత్రం సభ్యులు మహమ్మద్ మియా, సీవీ రెడ్డి, శివయ్య, ఎస్ఎండీ ఇనాయతుల్లా, ఎర్రమ పాండురంగయ్య, రాజారత్నం, యాగంటీశ్వరయ్య, సంగా ఆంజనేయులు, వాల్మీకి రాముడు, గాండ్ల లక్ష్మన్న, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య విభావరి : చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వజ్రోత్సవ సాంస్కృతిక వారోత్సవాల్లో నిర్వహించిన జానపద, శాస్త్రీయ, సినీ నృత్య విభావరి ప్రేక్షకులను ఆసాంతం అకట్టుకుంది. కూచిపూడి, భరతనాట్యం నృత్య గురువులు నారాయణస్వామి, ఎస్.కరీముల్లా, రోహిత్, నాగసాయి ప్రదీప్‌ల ఆధ్వర్యంలో నృత్య కళాకారులు వివిధ రూపకాలపై ఆకట్టుకునేలా ప్రదర్శనలు చేశారు.

నేడు శ్రీవేంకటేశ్వర మహాత్యం నాటకం : టీజీవీ కళాక్షేత్రంలో శనివారం ఏడోరోజు వజ్రోత్సవ వారోత్సవాల చివరి రోజు కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం 6 గంటలకు 'శ్రీ వెంకటేశ్వర మహాత్యం' భక్తిరస పద్య నాటకం ప్రదర్శిస్తున్నారు. టీజీవీ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రదర్శిస్తున్న ఈ నాటకానికి అకాడమీ అధ్యక్షుడు, ప్రముఖ నాటక దర్శకుడు, సీనియర్ రంగస్థల నటుడు వీవీ రమణారెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. శారదా ప్రసన్న ఈ నాటకం రాశారని పత్తి ఓబులయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ హాజరవుతారని ఆయన తెలిపారు.

ప్రగతిలో రహదారి


ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్‌కు పరిధిలో కొత్తగా ప్రతిపాదించిన ఎసెన్షియల్ ఎక్స్‌టర్నల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మ్యాప్

3వ పేజీ తరువాయి

ఓర్వకల్లు నోడ్ పరిధిలోని ఉప్పలపాడు-ఉశేనాపురం జిల్లా రహదారి (డీఆర్) 8 కిలోమీటర్లు రూ.72 కోట్లతో, ఉప్పలపాడు-రామళ్లకోట జిల్లా రహదారి 15 కిలోమీటర్లు రూ.135 కోట్లతో, గుట్టపాడు - బ్రహ్మణపల్లి జిల్లా రోడ్డు 9 కిలోమీటర్లు రూ.80 కోట్లతో మొత్తం 32 కిలో మీటర్లు రూ.207 కోట్లతో నాలుగు వరుసల జాతీయ రహదారిగా ఆధునికీకరణపై ప్రధానంగా చర్చించారు. ఈ పనులు చేపట్టేందుకు ఇప్పటికే నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ)కు రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. ఈ మూడు రోడ్లలో ఇప్పటికే గుట్టుపాడు నుంచి ఎన్‌హెచ్-40 రోడ్డు వరకు కొంత భాగం ఎన్‌హెచ్ఏఐ తీసుకున్నట్లు ఆ శాఖ అధికారులు మంత్రికి వివరించారు. తక్షణమే పనులు చేపట్టాలని సబంధిత శాఖ ఇంజనీర్లను ఆదేశించారు వీటితో పాటు బేతంచర్లలో రైల్వే సబ్‌వే నిర్మాణం పనులు ప్రారంభించాలని రైల్వే అధికారులను ఆదేశించారు.

ఓర్వకల్లుకు చేరువలో...

ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్‌కు చేరువలోనే జాతీయ రహదారులు, రైల్వేలైన్లు, విమానాశ్రాయాలు ఉన్నాయని మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి సమీక్ష సమావేశంలో ఆయా శాఖల అధికారులు వివరించారు. ఓర్వకల్లుకు 4 కి.మీల దూరంలో కర్నూలు-రాణిపేట జాతీయ రహదారి (ఎన్‌హెచ్)-40, 28 కి.మీల దూరంలో కర్నూలు నుంచి అనంతపురం నేషనల్ హైవే-44 రోడ్డు, 26 కి.మీల దూరంలో కర్నూలు-డోర్నాల నేషనల్ హైవే-340సీ రోడ్లు ఉన్నాయి. 35 కి.మీల దరంలో కర్నూలు, 49 కి.మీల దూరంలో నంద్యాల రైల్వే స్టేషన్లు, 49 కి.మీల దూరంలో డోన్ రైల్వే జంక్షన్ ఉంది. 12 కి.మీల దూరంలో కర్నూలు (ఓర్వకల్లు) విమానాశ్రయం, 171 కి.మీల దూరంలో కడప ఎయిర్ పోర్టు, 233 కి.మీల దూరంలో శంషాబాద్, హైదరాబాద్ విమానాశ్రాయలు ఉన్నాయి. 320 కి.మీల దూరంలో కృష్ణపట్నం ఓడరేవు, 420 కి.మీల దూరంలో కట్టుపల్లి పోర్టు ఉన్నాయని 2వ టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం చర్చించడం జరిగింది.

2,612 ఎకరాల్లో రూ.2,786 కోట్లతో వసతులు:


ఇప్పటికే ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ 2,612 ఎకరాల్లో రూ.2,786 కోట్లతో అభివృద్ధి చేస్తామని ఈ ఏడాది జూన్ 23న కేంద్రం ప్రకటించింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ కేంద్ర బడ్జెట్-2024-25లో కీలక ప్రకటన చేశారు. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎన్ఐసీడీపీ)లో భాగంగా ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీల అభివృద్ధికి కేంద్రం ఆమోదం తెలిపింది. ఫేజ్-1 కింద 2,612 ఎకరాల్లో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలో రూ.2,786 కోట్లతో మౌలిక వసతులు కల్పన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. నాన్ మెటలిక్ మినరల్ పరిశ్రమలు, ఆటోమొబైల్ రంగం విడిభాగాలు తయారి, పునరుత్పాదక పరిశ్రమలు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ పరికరాలు, ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ హార్డ్‌వేర్, ఫార్మాస్యూటికల్స్, వజ్రాలు, బంగారు అభరాలు తయారీ, వస్త్ర ఉత్పత్తి రంగ పరిశ్రమలు ఇక్కడే ఏర్పాటు చేసేందుకు నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఐసీడీసీ) ప్రత్యేక దృష్టిని పెట్టింది. ఆయా పరిశ్రమలు ఏర్పాటు ద్వారా రూ.12 వేల కోట్లు పెట్టుబడులు, 45,071 మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా వేశారు. తాజాగా రాష్ట్ర పెట్టుబడులు, మౌళిక వసతుల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు ఏర్పాటుపై చర్చించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

చిన్నారి సాయి చిత్రకళా వైభవం

● కోటేశ్ ఆర్ట్ అకాడమీలో శిక్షణ ● పదో తరగతిలోనే పలు విజయాలు

ప్రతిభ PRATIBHA


మెడల్స్, పతకాలు, సర్టిఫికెట్‌తో సాయి భవతి



నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఆలోచనలో నవ్యత, రేఖల్లో సృజనాత్మకత, రంగులో ఆకర్షణ.. చిన్నారి సాయి భవతి కుంచె నుంచి జాలువారుతున్నాయి. జాతీయ, అంతర్జాతీయ చిత్రలేఖన పోటీల్లో పలు పతకాలు, అవార్డ్స్ సాధించి ప్రత్యేక గుర్తింపు పొందింది. నంద్యాలకు చెందిన పల్లా రమేష్, స్వర్ణ దంపతుల కుమార్తె సాయి భవతి 10వ తరగతి చదువుతోంది. పసిప్రాయంలోనే పలకలపై, పుస్తకాలపై ఏవేవో బొమ్మలు గీస్తూ మురిసిపోయేది. ఇది గమనించి తల్లిదండ్రులు రంగులు, పుస్తకాలు ఇచ్చి ప్రోత్సహించారు. కోటేష్ ఆర్ట్ అకాడమీలో శిక్షణ ఇప్పిస్తున్నారు. అక్కడ తన సృజనాత్మకతకు మెలకువలు నేర్చుకున్నది. చిత్రకళలో నిత్యం సాధన చేసి చక్కని బొమ్మలు గీస్తోంది. కలర్ పెన్సిల్ వర్క్, క్రేయాన్స్ వర్క్, వాటర్ కలర్స్, కాన్వాసు పెయింటింగ్స్ ఇలా అన్ని పద్ధతుల్లో బొమ్మలు గీస్తోంది. తన బొమ్మల్లో పర్యావరణ, ప్లాస్టిక్ వినియోగంవల్ల నష్టాలు, కాలుష్య నివారణ చైతన్యం, నీటి సంరక్షణ వంటి సామాజిక కోణాలను ప్రతిబింబిస్తోంది. సాయి భవతి వేసిన చిత్రాలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో పతకాలు వచ్చాయి. కాన్వాసు పెయింటింగ్స్‌లో చాలా అద్భుతమైన బొమ్మలు వేసింది. అర్ధనారీశ్వరుడు, నందీశ్వరుడు, గణపతి, శ్రీరామపట్టాభిషేకం వంటి దేవతా మూర్తుల బొమ్మలు వేసింది. పల్లె పడుచులు, చత్రపతి శివాజీ, హంస, చిరుత ఇలా ఎన్నో చిత్రాలు కాన్వాసుపై అద్భుతంగా వేసింది.

సాయి భవతి సాధించిన విజయాలు

- 2021లో మహారాష్ట్రలోని నాసిక్ స్వామి వివేకానంద ఎడ్యుకేషన్ సంస్థవారు నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి చిత్ర కళా ప్రదర్శనలో స్వర్ణ పతకం సాధించింది.
- 2021లో తూర్పుగోదావరి జిల్లా అమలాపురంలోని కోనసీమ చిత్రకళా పరిషత్ వారు నిర్వహించిన అంతర్జాతీయ చిత్రకళా పోటీల్లో బంగారు పతకం..
- 2022లో యంగ్ ఇన్వోస్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ చిత్రకళా పోటీల్లో రజత పతకం..
- 2023 గుంటూరు జిల్లాలోని క్రియేటివ్ ఆర్ట్ అకాడమి, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన జాతీయస్థాయి చిత్రలేఖన పోటీల్లో బంగారు పతకం..
- 2023 నెల్లూరులో అమీర్ ఆర్ట్ అకాడమీ వారు నిర్వహించిన జాతీయస్థాయి చిత్రకళా పోటీల్లో బంగారు పతకం..
- 2023లో పల్నాడు జిల్లా వినుకొండలో బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ వారు నిర్వహించిన జాతీయస్థాయి చిత్రలేఖన పోటీల్లో బంగారు పతకం..
- 2023లో విజయవాడలోని డ్రీమ్ ఆర్ట్ అకాడమీ వారు నిర్వహించిన జాతీయస్థాయి చిత్రకళ పోటీల్లో బంగారు పతకం..
- 2024లో విజయవాడలోని ప్రోగ్రెస్ ఆఫ్ బడ్స్ సంస్థ వారు నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి చిత్రకళ పోటీల్లో బంగారు పతకం.. సాధించింది.


సాయి భవతి వేసిన చిత్రాలు

జీజీహెచ్‌లో నిలువు దోపిడీ

- కోట్లాది రూపాయల విద్యుత్ బిల్లులు బకాయి
- ప్రభుత్వం నుంచి దర్జాగా బిల్లులు చేసుకుంటున్న వైనం
- ఎన్నారై అకాడమీ నుంచి బిల్లులు వసూలు చేసేదెవరు ?
- గత వైసీపీ ప్రభుత్వం నుంచి రూపాయి కూడా చెల్లించని విద్యుత్ శాఖ



నంద్యాల జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన ఎం.ఆర్.ఐ. స్కానర్



సిటీ స్కానర్

నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ఆస్పత్రిలో అయిదేళ్ల క్రితం అప్పటి వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎంఆర్ఐ, సిటీ స్కానర్లు ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణ ఎన్నారై అకాడమి ఆఫ్ సైన్స్ సంస్థకు కట్టబెట్టారు. ఎమ్మారై, సిటీ స్కాన్లు ప్రారంభమైనప్పటి నుంచి ఇంతవరకు ఒక్క రూపాయి కూడా కరెంటు బిల్లు చెల్లించకపోవడం గమనార్హం. గత వైసీపీ ప్రభుత్వం చేసిన పాపం ప్రస్తుతం నంద్యాల సర్వజన ప్రభుత్వ ఆస్పత్రికి చుట్టుకుంది. ఇప్పటి వరకు దాదాపు కోటి పదిహేను లక్షల రూపాయల విద్యుత్ బకాయిలు ఉన్నాయంటే అధికారుల పనితీరు ఇట్టే తెలుస్తోంది. ఎన్నారై అకాడమీ సంస్థకు చెల్లించాల్సిన డబ్బును అప్పనంగా చెల్లిస్తున్నారేకాని విద్యుత్ బకాయిలు మాత్రం వసూలు చేసుకోవడంలో అధికారుల నిర్లక్ష్యానికి ప్రస్తుతం పేరుకుపోయిన విద్యుత్ బిల్లులే నిదర్శనమని చెప్పవచ్చు. నంద్యాల జీజీహెచ్‌లో ఎమ్మారై, సిటీ స్కాన్ల కోసం ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్, సబ్ మీటర్ ఏర్పాటు చేశారు. సబ్ మీటర్‌లో వచ్చిన రీడింగ్‌కు యూనిట్‌కు రూ.10చొప్పున జీజీహెచ్ చార్జి చేస్తోంది. వైసీపీ హయాంలో ఎమ్మారై, సిటీ స్కాన్ నిర్వహణ వైసీపీ అనుయాయులకు కట్టబెట్టారు. ఎన్నారై అకాడమి ఆఫ్ సైన్స్ సంస్థ నుంచి నంద్యాలకు చెందిన ఓ మందుల దుకాణం యజమానికి ఏడు శాతం, ఆత్మకూరు వైసీపీ నాయకుడికి నలభై శాతం, నంద్యాలలోని ఓ వైద్యుడికి 53 శాతం వాటాతో నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో ఎమ్మారై, సిటీ స్కాన్ల నిర్వహణ దక్కించుకున్నారు.

దాదాపు మూడేళ్లు వీరు నిర్వహించగా అప్పట్లో కూడా విద్యుత్ బిల్లులు చెల్లించలేదు. అనంతరం ఎన్నారై అకాడమే స్వయంగా వీటి నిర్వహణ ఇప్పటి వరకు చేస్తోంది. జీజీహెచ్‌కు ప్రతిరోజు దాదాపు 40 ఎమ్మారై స్కాన్లు, 60కిపైగా సిటీ స్కాన్లు చేస్తున్నారు. ఈ లెక్కన నెలకు వెయ్యికిపైగా ఎమ్మారై స్కాన్లు, 1500కుపైగా సిటీ స్కాన్లు చేస్తున్నారు. అప్పటి ప్రభుత్వం ఎమ్మారైకి రూ.2650, సిటీ స్కాన్‌కు రూ.1060 చెల్లించేలా ఒప్పందం చేసుకుంది. గత అయిదేళ్లనుంచి ఒప్పందం ప్రకారం ప్రభుత్వం నుంచి కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్నా ఎన్నారై అకాడమీ సంస్థ ఇప్పటి వరకు విద్యుత్ బిల్లు చెల్లించకపోవడం గమనార్హం.

ఒక రోజుకు చేస్తున్న పరీక్షలు
ఎంఆర్ఐ స్కాన్ 30 - 40 సిటీ స్కాన్ 60 - 70
రెండింటికి ప్రభుత్వం చెల్లించే డబ్బు దాదాపు రూ.5లక్షలు
నెలకు విద్యుత్ బిల్లు దాదాపు రూ.2లక్షలు

నంద్యాల జీజీహెచ్ నుంచి పలుమార్లు విద్యుత్ బిల్లు చెల్లించాలని నోటీసులు ఇచ్చిన ఎన్నారై అకాడమి ఆఫ్ సైన్స్ సంస్థ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించింది. 15-05-2019నుంచి 16-08-2019వరకు మూడు నెలల బిల్లు రూ.3,29,400 నోటీసు పంపారు. అలాగే 6-09-2024నుంచి 12-11-2024వరకు రూ.4,01,600 విద్యుత్ బకాయిలున్నట్లు చివరగా నోటీసు పంపారు. ఎమ్మారై, సిటీ స్కాన్లు స్థాపించినప్పటి నుంచి 12-11-2024 వరకు మొత్తం విద్యుత్ బకాయిలు రూ.97,54,610 ఉన్నాయి. ప్రస్తుత ఆరు నెలలకు సంబంధించిన విద్యుత్ బకాయిలు దాదాపు రూ.15లక్షల వరకు ఉండవచ్చని అంచనా. ప్రభుత్వ సంస్థ కాబట్టి విద్యుత్ అధికారులు కూడా బకాయిల వసూళ్లపై ఒత్తిడి తేవడంలేదని తెలుస్తోంది. ప్రజా ప్రయోజనాల కోసం ఏర్పాటు చేసిన జీజీహెచ్‌కు నిరంతర విద్యుత్ ఇవ్వాలనేది విద్యుత్ అధికారుల ఆలోచన. అయితే ఇదే అదనుగా చేసుకొని ఎన్నారై అకాడమి కోట్లాది రూపాయలు గడిస్తున్నా విద్యుత్ బకాయిలు చెల్లించకపోవడం పట్ల ఆస్పత్రి వర్గాలు మౌనంగా ఎందుకు ఉన్నాయన్నది చర్చనీయాంశమైంది.

ఎన్నారై అకాడమీ చెల్లింపులు నా దృష్టికి రాలేదు



జీజీహెచ్‌లో ఎంఆర్ఐ, సిటీ స్కాన్ల నిర్వహణ చేస్తున్న ఎన్నారై అకాడమీ ఆఫ్ సైన్స్‌కు బిల్లుల చెల్లింపు విషయం నా దృష్టికి రాలేదు. ఫిబ్రవరిలో జీజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా చార్జి తీసుకున్నాను. విద్యుత్ బకాయిల చెల్లింపు విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటాం. **- డా. మస్తాన్, అసిస్టెంట్ డైరెక్టర్, జీజీహెచ్, నంద్యాల.**

స్పందన నుంచి సమస్య లోక్ అదాలత్‌కు

కర్నూలు లీగల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గత ఏడాదిగా స్పందనలో పరిష్కారం కాని వివాదాన్ని నెల రోజుల్లో తాము పరిష్కరించినట్లు శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్లూరు మండలం పందిపాడు గ్రామంలో తమ ఇంటి ముందు డ్రైనేజీ నీటి కాలువలో చెత్త పేరుకుపోయి తీవ్ర అనారోగ్యాలకు కారణమవుతుందని శ్రీరాములు 2023లో స్పందనలో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఆయనతో పాటు కాలనీ ప్రజలు కర్నూలు మున్సిపల్ కమిషనర్‌కు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కానీ సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. దీంతో ఫిర్యాది శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించాడు. ఈ మేరకు శాశ్వత లోక్ అదాలత్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు నోటీసులు జారీ చేయడంతో వారు వెంటనే స్పందించి ఫిర్యాది ఇంటి ముందు నిల్చుని వున్న మురుగురె తొలగించారు. ఫిర్యాదికి మున్సిపల్ అధికారులు రూ.10వేల నష్టపరిహారాన్ని కూడా చెల్లించాలని తీర్పునిచ్చినట్లు శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు ఎం.వెంకట హరినాథ్ ఒక ప్రకటనలో తెలిపారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

కోడుమూరు రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లద్దగిరి గ్రామంలో గుండెపోటుతో ఉపాధి శ్రామికుడు చిన్నరాముడు (36) మృతి చెందాడు. గ్రామానికి చెందిన ఈయన (జాబ్‌కార్డు- 011815) శుక్రవారం ఉదయం స్థానిక ఊటుకుంటవాగు సమీపంలో ఉపాధి పథకం కింద చేపట్టిన కాలువ పూడికతీత పనులకు వెళ్లాడు. హాజరు వేసుకుని పనికి ఉపక్రమిస్తున్న క్రమంలో కళ్లు తిరిగి కిందపడిపోయాడు. దీంతో ఆందోళన చెందిన తోటి శ్రామికులు చిన్నరాముడును బైక్‌పై తీసుకుని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని ఇంటికి చేర్చారు. సమాచారం అందుకున్న ఏపీవో మోదీన్‌బాషా, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, టీఏ శ్రీనివాసరాజు, ఎఫ్ఏ మహబూబ్‌బాషా మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. టీడీపీ నాయకులు పట్టె మధు, గుడిసె జయన్న, రామాంజనేయులు కుటుంబసభ్యులను పరామర్శించారు.

వైసీపీ నాయకుడి హత్య



పెద్ద వెంకటేశులు (ఫైల్)

హాలహర్వి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమృతాపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు పెద్ద వెంకటేశులు (50) హత్యకు గురయ్యాడు. ఎస్ఐ చంద్ర తెలిపిన మేరకు. పెద్ద వెంకటేష్ పొలం పనికి వెళ్లి సాయంత్రమైన తిరిగి రాలేదు. బంధువులు సాయంత్రం పొలానికి వెళ్లి చూడగా మృతదేహం కనిపించింది. దీంతో పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ రవి శంకర్ రెడ్డి, హాలహర్వి పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అయితే హత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

రైతు మృతి

కర్నూలు (క్రైం), 25 (ఆంధ్రజ్యోతి): ఉలిందకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో లక్ష్మీపురం గ్రామంలో ఆత్మహత్యాయత్నం చేసిన రైతు ఎర్రమల(51) ఆస్పత్రిలో శుక్రవారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన ఎర్రమల తన సొంత పొలం నాలుగెకరాలతో పాటు మరో పది ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం సాగుచేస్తున్నాడు. పొలంలో పంట దిగుబడులు సరిగా రాకపోవడంతో అప్పులు పెరిగాయి. కొన్నేళ్లుగా తాను పెంచుకున్న ఎద్దులను ఇటీవల అప్పులు తీర్చేందుకు అమ్మేశాడు. అయినా అప్పులు తీరకపోవడంతో మనస్తాపానికి గురై ఆదివారం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నం చేశాడు. బంధువులు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ధనుంజయ తెలిపారు.

కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం

నంద్యాల టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నంద్యాల హెడ్ క్వార్టర్స్‌లో పని చేస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ చిన్నికృష్ణ శుక్రవారం ఆత్మహత్యాయత్నం చేశారు. నంద్యాల పట్టణ శివారుల్లోని శివగార్డెన్ సమీపంలో గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఆయనను స్థానికులు గుర్తించి పట్టణంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆయనది సొంతూరు అవుకు. అయితే ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు.

పొగాకు దగ్ధం

పాములపాడు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్కాల గ్రామం శివారులో రైతులు తాము పండించిన పొగ పంటను కట్టలు కట్టి ఆరబెట్టుకున్నారు. అయితే ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గుర్రం వెంకటేశ్వర్లుకు చెందిన 30 క్వింటాళ్లు, సోమేశ్వరుడు 10 క్వింటాళ్లు, తెలుగు రాముకు చెందిన 10 క్వింటాళ్లు, బన్నూరు శివకు చెందిన 10 క్వింటాళ్ల పొగాకు కాలిపోయింది. చుట్టు పక్కల రైతులు స్పందించి బావిలోని నీటిని మోటార్ల ద్వారా మంటలను అదుపు చేశారు. దీంతో చుట్టుపక్కల రైతుల పొగాకుకు ప్రమాదం తప్పింది. రూ.15 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



మంటలను ఆర్పుతున్న స్థానికులు

బంగారం పేరుతో మోసం

- నిందితుడి అరెస్టు
- రూ.45.91లక్షల రికవరీ

కర్నూలు క్రైం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తక్కువ ధరకు బంగారం ఇప్పించి, ఎక్కువ ధరకు అమ్మిస్తామని నమ్మించి రూ.48.50 లక్షలు మోసం చేసిన కేసులో నిందితుడు రంగు నాగేష్ అలియాస్ నాగిరెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ బాబు ప్రసాద్, టూటౌన్ సీఐ నాగరాజరావు, త్రీటౌన్ సీఐ శేషయ్య శుక్రవారం నిందితుని వివరాలు వెల్లడించారు. హైదరాబాదు సరూర్‌నగర్‌కు చెందిన సంతోషిమాత అనే మహిళకు నిందితుడు మాయ మాటలు చెప్పి నమ్మించాడు. రూ.60 లక్షలు డబ్బులు ఇస్తే. కేజీ బంగారం కొని మళ్లీ అదే బంగారాన్ని రూ.90 లక్షలకు అమ్మిస్తానని.. రూ.30 లక్షలు లాభం వస్తుందని, కొద్దిపాటి లాభం తనకు ఇస్తే సరిపోతుందని చెప్పాడు. దీంతో మహిళ సంతోషిమాత తన భర్త శ్రీశైలంలో కొద్దిరోజుల కింద ఇల్లు అమ్మగా వచ్చిన మొత్తం రూ.48.50 లక్షలు తీసుకుని నిందితుడ్ని సంప్రదించింది. ఏప్రిల్ 19వ తేదీన కర్నూలు రావాలని సూచించడంతో ఆమె, ఆమె భర్త ఇద్దరు కలిసి కర్నూలు వచ్చారు. భార్యాభర్తలు సాయిబాబా ఆలయం వద్ద ఉండి బంగారం కొనే సమయంలో ఎవరూ ఉండకూడదని నమ్మించి కారులో వారి డబ్బులు తీసుకుని వెళ్లిపోయాడు. కొత్తబస్టాండు చేరుకుని అక్కడ కారు వదిలేసి బస్సులో వెళ్లిపోయాడు. ఆ తర్వాత నిందితుడు ఎప్పటికీ రాకపోవడంతో బాధితులు అనుమానం వచ్చి ఫోన్ చేశారు. ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో మోసపోయామని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితుడ్ని పట్టుకున్నారు. నిందితుని వద్ద నుంచి 45.91 లక్షలు రికవరీ చేశారు.



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ఎంపీడీవోలుగా పదోన్నతులు

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో పని చేస్తున్న పరిపాలన అధికారులు/డిప్యూటీ ఎంపీడీవోలకు.. ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పిస్తూ పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ కృష్ణతేజ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లాకు సంబంధించిన పరిపాలన అధికారులు/డిప్యూటీ ఎంపీడీఓలను కర్నూలు జిల్లాతో పాటు శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాలకు కేటాయించారు.

పేరు	ప్రస్తుతం	కేటాయింపు
బీవీ రమణారావు	ఏవో, డ్వామా, కర్నూలు	కర్నూలు
ఆర్. పార్థసారధి	ఏవో, ఉయ్యాలవాడ	శ్రీసత్యసాయి
జి.కరుణాసాగర్	ఏవో, కొత్తపల్లి	శ్రీసత్యసాయి
బి.నూర్జహా	ఏవో, జూపాడుబంగ్లా	కర్నూలు
కే.విజయశేఖర్‌రావు	ఏవో, ఆదోని	కర్నూలు
వి.విజయసింహారెడ్డి	ఏవో, గూడూరు	అనంతపురం
ఎం.బాలకృష్ణుడు	డిప్యూటీ ఎంపీడీవో, ప్యాపిలి	శ్రీసత్యసాయి
ఎం.సూర్యనారాయణ	డిప్యూటీ ఎంపీడీవో, దేవనకొండ	అనంతపురం
జి.ప్రభావతిదేవి	డిప్యూటీ ఎంపీడీవో, మంత్రాలయం	కర్నూలు
ఏ.మద్దిలేటి స్వామి	డిప్యూటీ ఎంపీడీవో మద్దికెర	కర్నూలు

మాజీ మంత్రి బుగ్గనపై విచారణ జరపాలి

డోన్ రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తున్న మద్యం కుంభకోణంలో రాష్ట్ర మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పాత్రపై కూడా సమగ్ర విచారణ జరపాలని డోన్ టీడీపీ నాయకుడు మర్రి రమణ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భారీ మద్యం కుంభకోణం వ్యవహారంలో అప్పటి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పాత్ర కూడా ఉంటుందని తాము భావిస్తున్నామన్నారు. అలాగే గత ఎన్నికల సమ యంలో మాజీ మంత్రి బుగ్గనపై చేసిన ఆరోపణలకు తాము ఇప్పటికీ కూడా కట్టుబడి ఉన్నామన్నారు. డోన్ నియోజకవర్గంలో జరిగిన పనులలో అవకతవకలు, వాటిలో ఆయనకు ఎంత లబ్ది చేకూరిందనే విషయా లపై కూడా సీఎం చంద్రబాబు సమగ్ర విచారణ చేయాలని కోరారు. వచ్చే సోమవారం విజయవాడలో చీఫ్ అధికారులను కలిసి వినతిపత్రం ఇస్తున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న మర్రి రమణ

పశుగ్రాసానికి నిధులు

- ఉమ్మడి జిల్లాలో 20వేల ఎకరాల్లో గ్రాసం పెంపు
- ఉపాధి నిధులతో పశువులకు పుష్కలంగా మేత



కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వేసవిలో రైతులు పాడి పశువుల పోషణ భారం భరించలేకపోతున్నారు. పశువులను పస్తులు పెట్టలేక సంతకు తీసుకెళ్లి కబేళాలకు విక్రయిస్తున్నారు. ఈ పరిస్థితులను గుర్తించిన కూటమి ప్రభుత్వం పాడి పశువులకు సమృద్ధిగా గ్రాసం (గడ్డి) అందించేందు కోసం ఉపాధి నిధులను పెద్ద ఎత్తున వినియోగించేందుకు చర్యలు తీసుకుంది. గతంలో వైసీపీ ప్రభుత్వం జిల్లా వేయి ఎకరాల్లో మాత్రమే గ్రాసాన్ని పెంచేందుకు ఉపాధి నిధులను నామమాత్రంగా వినియోగించింది. దీంతో గ్రాసం తగినంత అందుబాటులో లేక వ్యాపారుల నుంచి కొనుగోలు చేయలేక అప్పట్లో రైతులు పాడి పశువులను సంతలకు తీసుకెళ్లి అమ్మేసేవారు. కూటమి ప్రభుత్వం రావడంతో పెద్ద ఎత్తున గ్రాసం పెంపకానికి ఉపాధి నిధులు వెచ్చించడం ద్వారా ప్రస్తుత వేసవిలో పాడిగేదెలకు పూర్తి స్థాయిలో గ్రాసాన్ని అందుబాటులో తెచ్చేందుకు ఏర్పాట్లు చేసింది. 10 సెంట్ల నుంచి 50 సెంట్ల విస్తీర్ణంలో గ్రాసాన్ని పెంచుకునే రైతులకు రూ.33వేలు ఉపాధి హామీ పథకం ద్వారా ఉచితంగా అందించేందుకు ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఒక్కో మండలానికి 300 ఎకరాల చొప్పున పశుగ్రాసాన్ని పెంచేందుకు లక్ష్యాన్ని పశుసంవర్థక శాఖకు నిర్దేశించింది. కర్నూలు, నంద్యాల జిల్లాలో వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొంటున్న మండలాల్లో పశుగ్రాసాన్ని పెంచేందుకు మొదటి ప్రాధాన్యత కింద ఆయా మండలాల్లో ఉపాధి నిధులను వెచ్చించేందుకు అధికారులు ప్రస్తుతం చర్యలు చేపట్టారు. వచ్చే ఏప్రిల్ నాటికి ఉమ్మడి జిల్లాలో 20వేల ఎకరాల్లో పశుగ్రాసాన్ని పెంచే కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని కర్నూలు, నంద్యాల జిల్లాల పశుసంవర్థక శాఖ అధికారులు తెలిపారు. రెండు జిల్లాలో 5 లక్షల దాకా పాడి పశువులు ఉన్నట్లు వారు తెలిపారు.

రైతులకు సువర్ణావకాశం



ఉపాధి నిధుల ద్వారా రైతులు, పాడిగేదెల పెంపకందారులు పశుగ్రాసాన్ని పెంచేందుకు నిధులను పెద్ద ఎత్తున ప్రభుత్వం కేటాయించనుంది. మార్గదర్శకాలు వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటాం. **- శ్రీనివాస్, జేడీ, కర్నూలు**

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

ఫిర్యాదులు వస్తే సహించను

● ఎంఎల్ఎస్ గోడౌన్ ఇన్‌చార్జిపై ఎమ్మెల్యే ఆగ్రహం



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

నందికొట్కూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మళ్లీ ఫిర్యాదులొస్తే సహించబోనని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఎంఎల్ఎస్ గోదాము ఇన్‌చార్జి నారాయణమ్మపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం నందికొట్కూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల డీలర్లు గత రెండు మూడు నెలలుగా ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి రేషన్ కోటాలో కోతలు విధిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే ఆయిల్ తదితర వస్తువుల పంపిణీ సక్రమంగా జరగడం లేదని తనకు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. పేదలకు ఇచ్చే రేషన్, చిన్న పిల్లలకు, బాలింతలకు ప్రభుత్వం అందించే ఆహార పదార్థాలను డీలర్లకు, అంగన్‌వాడీ కేంద్రాలకు పూర్తి స్థాయిలో అందించాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పాల్గొన్నారు.

'గ్రామాభివృద్ధికి కృషి'

నంద్యాల రూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. భీమవరం గ్రామంలోని ముస్లింల శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణం కోసం రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ నుంచి రూ.66 లక్షల నిధులు మంజూరు కావడంతో ప్రజలు శుక్రవారం గ్రామంలో ఫిరోజ్‌కు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఫిరోజ్ మాట్లాడుతూ శ్మశానం ప్రహరీకి న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ నిధులు మంజూరు చేయించారన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా నిత్యం అందుబాటులో ఉంటూ పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

'పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవాలి'

నంద్యాల రూరల్ , ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ మార్పిడికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని, దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సుగుణశ్రీ సూచించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ 2023 డిసెంబరు 1 నుంచి 2024 అక్టోబరు 31 మధ్య పింఛన్‌దారుడైన భర్త చనిపోయిన మహిళ పింఛన్ మార్పిడికి అర్హులని తెలిపారు. మండలంలో 118 మంది పింఛన్‌దారులైన పురుషులు మరణించారని, అర్హులైన మహిళలు తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డు, అలాగే భర్త ఆధార్ కార్డు, పింఛన్ బుక్, మరణ ధ్రువీకరణ పత్రాలతో సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

'విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటం'

నంద్యాల రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నాయక్ అన్నారు. పట్టణంలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఈఏపీసెట్, నీట్‌కు సంబంధించిన మోడల్ టెస్టు పోస్టర్లను విడుదల చేశారు. నాయక్ మాట్లాడుతూ నెరవాడ సమీపంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 28న ఆన్‌లైన్‌లో నీట్, ఈఏపీ సెట్ మోడల్ టెస్టు, 29న ఆఫ్‌లైన్‌లో ఈఏపీ సెట్, నీట్ మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు అవగాహన కల్పించి భయం పోగొట్టేందుకు ఈ టెస్టులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సాయి, శ్యాముల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ

పాములపాడు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పాములపాడులో ఉపాధి పనులను ఎంపీడీవో చంద్రశేఖర్ తనిఖీ చేసి మస్టర్లను పరిశీలించారు. ఉపాధి సిబ్బంది సూచించిన మేర పనులు చేయాలన్నారు. ఎండలు ఎక్కువగా నేపథ్యంలో కూలీలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

నంద్యాల టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల స్థలం విషయంలో ఇరువర్గాలు ఘర్షణ పడగా ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు రెండో పట్టణ పోలీసులు తెలిపారు. ఒక వర్గానికి కొందరు వ్యక్తులు పాంప్లెట్లు కొట్టి పంచుతుండడంతో మరో వర్గం వారు ఎందు పంచుతున్నారని ప్రశ్నించారు. దీంతో ఇరువర్గాల ఘర్షణలో ఒక్కో వర్గంలోని ఒక్కొక్కరికి గాయాలయ్యాయి. తనపై దాడి చేశారని శ్యాంసుందర్‌లాల్ ఫిర్యాదు చేయడంతో వెంకటేశ్‌బాబుతో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. తనపై దాడి వెంకటేశ్‌బాబు కూడా ముగ్గురి వ్యక్తులపై ఫిర్యాదు చేసినట్లు సీఐ ఇస్మాయిల్ తెలిపారు.

మలేరియాతో అప్రమత్తంగా ఉండాలి



ర్యాలీ చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మలేరియాతో అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ సూచించారు. ప్రపంచ మలేరియా నివారణ దినం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని జిల్లా మలేరియా నివారణ అధికారి కామేశ్వర రావు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్‌వో జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం దోమల అంతం ఆరోగ్యశాఖ పంతం అని ప్రతిజ్ఞ చేశారు. జిల్లా అదనపు వైద్యఆరోగ్య శాఖ అధికారి శారదాబాయి, జిల్లా వ్యాధినిరోధక టీకా అధికారి డా.సుదర్శన్‌బాబు, జిల్లా ప్రోగ్రాం మానిటరింగ్ అధికారి డా.అంకిరెడ్డి, వైద్యులు కాంతారావునాయక్, భరత్‌కుమార్, శ్రీజ, రవీంద్రనాయక్, మలేరియా నివారణ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తప్పిపోయిన యువతి

● పోలీసుల అప్రమత్తతతో ఆచూకీ లభ్యం

ఆత్మకూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన యువతిని నిమిషాల వ్యవధిలో పోలీసులు గుర్తించిన ఘటన గురువారం రాత్రి ఆత్మకూరులో చోటు చేసుకుంది. అర్బన్ సీఐ రాము తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాములపాడుకు చెందిన సావిత్రమ్మ అనే మహిళ తమ కుటుంబీకుల వివాహం నిమిత్తం ఆత్మకూరులో దుస్తులను కొనుగోలు చేసేందుకు వచ్చింది. ఈక్రమంలోనే ఆమె వెంట వచ్చిన ఆమె కోడలు ఒడిశాకు చెందిన 20ఏళ్ల సుమిత్ర అనే యువతి ఒక షాపు నుంచి మరోషాపులోకి వెళ్లే క్రమంలో తప్పిపోయింది. ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో గురువారం రాత్రి ఆత్మకూరు పట్టణంలో గస్తీ చేస్తున్న అర్బన్ సీఐ రాము కనిపించడం విషయాన్ని ఆయనకు తెలియపరిచింది. దీంతో వెంటనే ఆయన స్పందించి తన సిబ్బందితో పట్టణంలో గాలింపు చర్యలు చేపట్టారు. సుమిత్రను గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో సావిత్రమ్మ కుటుంబీకులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ గాలింపు చర్యల్లో కానిస్టేబుళ్లు రవికుమార్, శ్రీనివాసులు ఉన్నారు.

పేరుకే జగనన్న కాలనీలు

● కనీస సౌకర్యాలు కరువు
● ఇళ్ల నిర్మాణానికి ఆసక్తి చూపని లబ్ధిదారులు

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయంలో ఇళ్లులేనివారికి ఇల్లు నిర్మించి ఇస్తామన్న మాటలు దాటవేసి చివరికి లబ్ధిదారులే నిర్మించుకోవాలని చెప్పడంతో అప్పసప్పుచేసి ఇళ్లు నిర్మించుకున్నారు. మండలంలో మొత్తం 11 లేఅవుట్లు కేటాయించారు. లబ్ధిదారులే నిర్మించుకోవాలని చెప్పడంతో ముందుకురాకపోవడంతో ప్రభుత్వం లేఅవుట్లను ఖాళీగా వదిలేయంతో చిట్టడివిలా మారిపోయాయి. పోతులపాడు, తర్తూరు గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు లేవని చెప్పడంతో లక్షలు వెచ్చింది స్థలాలు కొనుగోలు చేసి లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చిన ఒకటి, రెండు ఇళ్లు నిర్మించి లే అవుట్లను వదిలేశారు. మండలంలోని ప్రధానంగా జూపాడుబంగ్లా, తంగడంచ, మండ్లెం గ్రామాల్లో మాత్రమే జగనన్న కాలనీలో నిర్మించుకున్నారు. జూపాడుబంగ్లా, 80బన్నూరు గ్రామాలకు సంబంధించిన వారికి ఇళ్లకేటాయించడంతో ఇళ్లు నిర్మించుకున్నారు. అయితే తాగునీటికి, రహదారులులేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తంగడంచలో కూడా అదే పరిస్థితి నెలకొంది. మండ్లెం గ్రామానికి లేఅవుట్ రెండు కిలో మీటర్లు ఉంది. అందులో బోరువేసిన అందులో తక్కువనీరు ఉండటంతో సరిపోవడం లేదని అంటున్నారు. లే అవుట్ తక్కువ ఇళ్లు ఉన్నా కనీస సౌకర్యాలు



జూపాడుబంగ్లాలోని జగనన్న కాలనీలో గుంతల్లో వర్షపునీరు



తంగడంచలో నిరుపయోగంగా ఉన్న కొళాయి

కల్పించకపోవడంతో చెత్తచెదారంతో నిండిపోయింది. ఎవరు పట్టించుకోకపోవడంతో దిక్కులేకుండా కాలనీలు పడి ఉన్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. అధికారులు స్పందించి కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

రోడ్లు గుంతలతో నిండిపోయాయి



జూపాడుబంగ్లాలోని జగనన్నకాలనీలో రహదారులు వేయక పోవడంతో ఇళ్లముందు గుంతలు పడి వర్షపు నీరు నిల్వ ఉంటోంది. రహదారులు గుంతలమయంగా ఉండటంతో రాత్రిపూట కింద పడుతున్నాం. అధికారులు స్పందించి సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

- నరసింహారావు, జూపాడుబంగ్లా

విద్యుత్ సౌకర్యం లేదు



జూపాడుబంగ్లాలోని కాలనీల్లో రాత్రిపూట ఇంటినుంచి బయటికి వెళ్లాలంటే చీకటిగా ఉంది. ఊర్లోకి వెళ్లి కాలనీలోకి రావాలంటే విద్యుత్తుదీపాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేసి ఇబ్బందులను పరిష్కరించాలి.

- నాగన్న, జూపాడుబంగ్లా

కనీస సౌకర్యాల కల్పనకు చర్యలు

కాలనీలను పరిశీలించి ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తే సీసీ రోడ్లను నిర్మిస్తాం. అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటాం.

- గోపికృష్ణ, ఎంపీడీవో

రూ. 2.5 కోట్లు మంజూరు

● గోరుకల్లు రిజర్వాయర్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే గౌరు చరిత



రిజర్వాయర్ వద్ద కుంగిన రాతి పరుపును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పాణ్యం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): గోరుకల్లు రిజర్వాయర్ రూ. 2.50 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నట్లు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత తెలిపారు. గోరుకల్లు రిజర్వాయర్ అవుట్‌పాల్ రెగ్యులేటర్ వద్ద కుంగిన రాతిపరుపును శుక్రవారం ఆమె పరిశీలించారు. గౌరు చరిత మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో రిజర్వాయర్ పట్టించుకోలేదన్నారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రీన్‌కో సంస్థ ద్వారా రూ.కోటితో పనులు చేపట్టినట్లు తెలిపారు. రూ.56 కోట్లతో ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. ఎక్స్‌పర్ట్ కమిటీ సూచనల మేరకు మళ్లీ ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. పాణ్యం, బనగానపల్లె ప్రాంతాలలో ఇంకా మొక్కజొన్న, వరి పంటలు ఉన్నాయని, ఎస్సార్బీసీ కాలుకు నీరు నిలిపివేయడంతో సాగుకు ఇబ్బంది ఏర్పడిందని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వరదల విపత్తు పనుల్లో భాగంగా బ్లాక్ 1 నుంచి బ్లాక్ 7 వరకు సీసెంట్ కాంక్రీట్ పనులు జరుగుతున్నాయన్నారు. రైతుల వినతుల మేరకు పంటలు పూర్తయిన తర్వాతే కాలువ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈఈ శుభకుమార్, డీఈ జ్యోతి, టీడీపీ మండల కన్వీనర్ జయరామిరెడ్డి, ఎంపీటీసీ రంగరమేష్, నాయకులు ఖాదర్ బాషా, రామ్మోహన్‌నాయుడు, అమరసింహారెడ్డి, రవి, గంగ నారాయణ, సునీల్, దానం, ప్రభాకర్, రామసుబ్బయ్య, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● విద్యుత్ ప్రమాదంలో పంటలు కోల్పోయిన రైతులను ఆదుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత కలెక్టరు రాజకుమారిని కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే పాణ్యంలో విద్యుత్ ప్రమాదంలో అగ్నికి ఆహుతైన మొక్కజొన్న పంటలను పరిశీలించారు. అనంతరం పంట నష్టాన్ని బాధిత రైతులు లింగమయ్య, సుబ్రహ్మణ్యం, మద్దిలేటిని అడిగి తెలుసుకున్నారు. ఎకరాకు రూ. 50 వేలు నష్టపోయామని రైతులు తెలిపారు. కలెక్టరును కలిసి బాధిత రైతులను ఆదుకోవాలని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఎస్పీ అధిరాజ్ సింగ్‌ను కలిసి పెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.

● పాణ్యం, గోరుకల్లు రహదారికి అదనంగా మరో రూ. 79 లక్షలు మంజూరైనట్లు ఎమ్మెల్యే గౌరు చరిత తెలిపారు. పాణ్యం ఎంపీడీవో కార్యాలయంలో సమస్యల పరిష్కార వేదికను ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పాణ్యం, గోరుకల్లు ఎస్సార్బీసీ రహదారి బీటీ రోడ్డుకు రూ. 5.50 కోట్లు మంజూరు కాగా ఇప్పటికే పనులు వేగవంతంగా జరుగుతున్నాయని చెప్పారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, తహసీల్దారు నరేంద్ర నాథ్ రెడ్డి, సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

చిత్తడి నేలల పరిరక్షణకు చర్యలు: కలెక్టర్

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): చిత్తడి నేలలను గుర్తించి వాటి పరిరక్షణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో చిత్తడి నేలల పరిరక్షణ కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 519చిత్తడి నేలలను గుర్తించి వాటిని గ్రౌండ్ ట్రూతింగ్ చేశామని, అందులో 10అటవీశాఖ పరిధిలో, ఇతర ప్రాంతాల్లో ఉన్న 509 చిత్తడి నేలలను సంబంధిత శాఖల అధికారులు సంరక్షించాలని ఆదేశించారు. ప్రభుత్వ భూముల్లో ఉన్న చిత్తడి భూములను గుర్తించి నోటిఫికేషన్ ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. జేసీ విష్ణుచరణ్, డీఆర్వో రాము నాయక్, డీఎఫ్‌వో నాగమునేశ్వరి, ఆర్డీవోలు, అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

ఆత్మకూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): విధుల్లో ఉత్తమ సేవలతోనే అధికారులకు గుర్తింపు సాధ్యమని ఆత్మకూరు ఎంపీడీవో సుబ్రమణ్యం పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విధుల్లో రాణించిన ఎంపీడీవో కార్యాలయ సూపరిండెంట్ సయ్యద్ ఉమర్, పంచాయతీ కార్యదర్శి జగజీవన్‌ను శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సత్కరించారు. డిప్యూటీ ఎంపీడీవో బాలునాయక్, సిబ్బంది కళ్యాణ్ తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ

కొత్తపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి సమీపంలో శుక్రవారం ఎస్ఐ ఆర్.జయశేఖర్ వాహనాల తనిఖీ చేపట్టారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడుపుతున్న 15 మంది వాహనాదారులకు రూ.2,800 జరిమానా విధించారు.

'పండ్ల తోటల పెంపకానికి చేయూత'

ఆత్మకూరు రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు పండ్లతోటల పెంపకానికి వంద శాతం రాయితీతో ప్రభుత్వం చేయూత నందిస్తోందని, దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, హార్టికల్చర్ అధికారి చందన సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో ఉపాధి సిబ్బంది, రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఏపీవో మనోహర్, నాగార్జున, సూపర్‌వైజర్ రవి, ఈసీ వరదరాజులు, మనోజ్‌కుమార్, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

'పేదల సంక్షేమమే లక్ష్యం'

ఆత్మకూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సంక్షేమమే జనసేన పార్టీ లక్ష్యమని ఆ పార్టీ సీనియర్ నాయకులు, ప్రముఖ న్యాయవాది ధూపం అభిమన్యుడు అన్నారు. శుక్రవారం స్థానిక కేవీఎస్ క్లినింగ్ నందు జనసేన పార్టీ ఆధ్వర్యంలో శాంతిరామ్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వారి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. జనసేన పార్టీ నాయకులు పురం హరీష్, వెంకటస్వామి, శ్రీరాములు, అరుణ్, నాగరాజు, శ్యామ్ ఉన్నారు.

'కార్మికుల సేవలు ఎనలేనివి'

వెలుగోడు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికుల సేవలు ఎనలేనివి అని సర్పంచ్ జయపాల్, ఈవోఆర్డీ మురారీ, ఈవో సుంకన్న అన్నారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని వారిని సన్మానించారు.

పోలీసులు ఒత్తిడి తగ్గించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న సైకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సింధూజ

నంద్యాల క్రైం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పోలీసులు ఒత్తిడిని తగ్గించుకోవాలని సైకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సింధూజ అన్నారు. ప్రతి శుక్రవారం నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే స్టాఫ్ పరేడ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు, ఏఎస్పీ యుగంధర్‌బాబు సూచనలతో ఏఎస్పీ చంద్రబాబు ఆధ్వర్యంలో పోలీసులకు ఒత్తిడిని తగ్గించేందుకు నిర్వహించిన కార్యక్రమంలో సింధూజ పలు మెలకువలు, సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది ఒత్తిడిని తగ్గించుకోవడం చాలా అవసరమన్నారు. ఒత్తిడిని తగ్గించేందుకు వ్యాయామం, యోగా, ఇతర శారీరక శ్రమలతోపాటు ధ్యానం వంటివి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

శ్రీశైలంలో నందీశ్వర స్వామికి పూజలు



నందీశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో శుక్రవారం త్రయోదశి ఘడియలను పురస్కరించుకొని సాయంప్రదోషకాలంలో ఆలయములోని మల్లికార్జునస్వామికి అభిముఖంగా కొలువై ఉన్న నందీశ్వరస్వామికి విశేష అభిషేకం, అర్చనలు జరిపించారు. లోక కల్యాణార్థం శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ఊయల సేవ నిర్వహించారు. శ్రీశైల క్షేత్ర గ్రామదేవత అంకాలమ్మకు శుక్రవారం లోకకళ్యాణాన్ని ఆకాంక్షిస్తూ విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది.

మహానంది క్షేత్రంలో..



మహానందిలో అభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు

మహానంది, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో చైత్ర బహుళ త్రయోదశి మహా ప్రదోషం సందర్భంగా శుక్రవారం సాయంత్రం ప్రధాన ఆలయంలోని రాతి నందీశ్వరునికి ఘనంగా ప్రదోషకాల నందీశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ వేదపండితులు నాగేశ్వరశర్మ, హనుమంత్‌శర్మతో పాటు అర్చకులు రఘుశర్మ, పుల్లారి జనార్దన్ శర్మ వేదమంత్రాలతో నందీశ్వరుడికి అభిషేక పూజలను నిర్వహించారు. అలాగే రాత్రి ఆలయ ప్రాంగణంలోని కల్యాణమంటపంలో పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ పసుపుల సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మల్లాలమ్మకు బోనాలు

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): నంద్యాల చిన్నచెరువుకట్ట వద్ద వెలసిన మల్లాలమ్మకు భక్తులు బోనాలు సమర్పించారు. మల్లాలమ్మ దేవస్థానం సప్తమ వార్షికోత్సవ వేడుకలలో భాగంగా శుక్రవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పదోన్నతిపై బదిలీ

నంద్యాల రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డిప్యూటీ ఎంపీడీవోలుగా విధులు నిర్వహిస్తున్న పార్థసారధి ఏవోగా (ఉయ్యాలవాడ) నుంచి సత్యసాయి జిల్లాకు బదిలీ అయినట్లు పంచాయతీరాజ్ శాఖ అధికారులు తెలిపారు. సాగర్ ఏవోగా (కొత్తపల్లె) లో విధులు నిరహిస్తు పదోన్నతిపై ఎంపీడీవోలుగా సత్య సాయి జిల్లాకు బదిలి అయినట్లు తెలిపారు. జుపాడుబంగ్లాలో పని చేస్తున్న నూర్జహ ఏవోగా పనిచేస్తూ ఎండీవోగా కర్నూలుకు, బాలకృష్ణుడు డిప్యూటీ ఎంపీడీవోగా పని చేస్తూ శ్రీ సత్యసాయి జిల్లాకు ఎంపీడీవోగా పంచాయితీ శాఖ అధికారులు తెలిపారు.

'ఉగ్రదాడి హేయం'



నంద్యాలలో ర్యాలీలో పాల్గొన్న ఎన్ఎండీ ఫిరోజ్, తులసిరెడ్డి తదితరులు

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లో పర్యాటకులపై దాడి హేయమని ఏపీటీఎఫ్ నాయకులు ఖండించారు. జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి శివయ్య మాట్లాడుతూ సామాన్యులపై క్రూరమైన దాడికి పాల్పడి హత్య చేయడం అమానవీయమని, ఇది మన దేశ ఐక్యత, సమగ్రతను దెబ్బతీసేలా ఉందని అన్నారు. జిల్లా కమిటీ సభ్యులు వీరేశ్వర్‌రెడ్డి, జాకీర్ హుస్సేన్, రమేష్, మధు, పుల్లయ్య, ఇద్రూస్‌బాషా, రాజేష్ పాల్గొన్నారు.

నంద్యాల క్రైం: ఉగ్రదాడి ఘటనను నిరసిస్తూ నంద్యాలలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం న్యాయవాదులు మృతులకు సంతాపం తెలిపారు. అధ్యక్షుడు హుసేన్‌బాషా, కార్యదర్శి ఎంఆర్ కృష్ణారెడ్డి, సీనియర్ న్యాయవాదులు రావినూతల దుర్గాప్రసాద్, వెదుర్ల రామచంద్రరావు, ఎం.వెంకటేశ్వర్లు, ఓబుళరెడ్డి, మురళి, కృష్ణయ్య, కానాల సుబ్బరాయుడు, మద్దిలేటి, సుధాంశురెడ్డి, తిరుపాలు, మహిళా ప్రతినిధి సౌజన్యం, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

నంద్యాల రూరల్: కశ్మీర్‌లో పర్యాటకులను కాల్చి చంపిన ఉగ్రవాదులను ఉరితీయాలని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, రాష్ట్రమార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం టీడీపీ కార్యాలయం నుంచి శ్రీనివాససెంటర్ మీదుగా గాంధీచౌక్ వరకు కొవ్వొత్తుల నిరసన ర్యాలీ చేపట్టారు. మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి, జనసేన నాయకులు సుధాకర్, డాక్టర్లు, వివిధ సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: కశ్మీర్ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర రక్షణ శాఖామంత్రి రాజీనామా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసనతెలిపారు. మృతి చెందిన వారికి కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. సీపీఎం ప్రజాసంఘాల నాయకులు ఉస్మాన్ బాషా, రంగమ్మ, బాబు, సాజిదాబి, జయరాణి, శేఖర్, శివ, శంకర్, వెంకటేశ్వర్లు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రదాడిని ఖండిస్తూ జూపాడుబంగ్లాలో శుక్రవారం కేజీ రోడ్డుపై సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా నాయకులు మాట్లాడుతూ భద్రతా వైఫల్యం వల్లే దాడి జరిగిందని, దీనికి రక్షణశాఖమంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో నరసింహులు, నాగన్న, సయ్యద్‌బాషా, అబ్దుల్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడికి పాల్పడటం అమానుషమైన వక్ఫ్ పరిరక్షణ జేఏసీ ప్రతినిధులు ముఫ్తీ నూర్‌మహ్మద్, ముఫ్తీ అల్తాఫ్, రహంతుల్లా మౌలానా, ఇలియాస్ మౌలానా, మాలిక్ మౌలానా అన్నారు. ఉగ్రవాద చర్యలను వ్యతిరేకిస్తూ వక్ఫ్ పరిరక్షణ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొలతో నివాళి అర్పించారు.

● కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళి అర్పించి నిరసన వ్యక్తం చేశారు. నాయకులు ప్రసాద్, శ్రీనివాసులు, రమణ, శంకర్‌రెడ్డి, నిజామోద్దీన్, వెంకటస్వామి, పుల్లన్న తదితరులు ఉన్నారు.



ఆత్మకూరులో..

బండిఆత్మకూరు: బండిఆత్మకూరులో ప్రజా సంఘాల నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం నాయకుడు రత్నమయ్య, వ్యవసాయం కార్మిక సంఘం నాయకుడు డేవిడ్, కాంగ్రెస్ పార్టీ జావీద్ మాట్లాడుతూ, రాజు, గంగాధర్‌రెడ్డి, మనహర్, రఫీ, శ్రావణ్, నారాయణ, శీను, తిరుపాల్, ఏంజెల్ పాల్గొన్నారు.

ఆత్మకూరు రూరల్: ముష్టపల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధులు భాషపోగుల దరగయ్య, బుజ్జి మాదిగ, నాగయ్య మాదిగ, దేవసహాయం, నాయకులు రమణ, పుల్లయ్య, తిమ్మరాజు, నాని, ముంతన్న, నాగశేషులు, రంగ స్వామి, పుల్లంరాజు, మోహన్, గ్రామస్థులు పాల్గొన్నారు

మహానంది: కశ్మీరు మృతులకు మహానందిలో హిందూ పరిరక్షణ వేదిక ఆధవర్యంలో శ్రద్ధాంజలి ఘటిస్తూ ర్యాలీ నిర్వహించారు. జీఆర్ కృష్ణ, భూమా గోపాల్, జనార్దన్‌రెడ్డి, పెద్ద కాశయ్య, లక్ష్మణ్‌నాయక్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు

● మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ


బాధితుడికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ

డోన్ రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న పేదల జీవితాల్లో సీఎం రిలీఫ్ ఫండ్ వెలుగులు నింపుతుందని డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మాజీ ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, టీడీపీ నాయకులు ఓంప్రకాష్, రవి, ధర్మవరం ఈశ్వరయ్య, టైలర్ ఖాజా పాల్గొన్నారు.

సుంకులమ్మ ఆలయంలో..

చిన్నమల్కాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన సుంకులమ్మ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాభివృద్ధికి తనవంతు సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.

కనీస వసతులు కల్పించాలి: సీపీఎం

డోన్ రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు జరిగే ప్రదేశాల్లో కనీస వసతులు కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి కోయలకొండ నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం కనపకుంట గ్రామ పరిసరాల్లో జరుగుతున్న ఉపాధి కూలీలతో సీపీఎం నాయకులు మాట్లాడారు. కొత్తపల్లె గ్రామంలో ఉపాధి హామీ పనులు ఇంత వరకు ఎందుకు మొదలు పెట్టలేదో అధికారులకు చెప్పాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రామాంజనేయులు, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

చాగలమర్రి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో ఎస్పీజీ చర్చి వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు శుక్రవారం హోరాహోరీగా సాగాయి. ఈ పోటీలను టీడీపీ నాయకుడు ఇండ్ల లక్ష్మీరెడ్డి, పాల డెయిరి చైర్మన్ రమణారెడ్డి, డీసీఆర్ చైర్మన్ సంజీవరాజు ప్రారంభించారు. ఈ పోటీలలో వివిధ ప్రాంతాలకు చెందిన 11 జతల వృషభాలు పాల్గొన్నాయి. పోటీల్లో గెలుపొందిన వృషభరాజముల యజమానులకు వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు నగదును దాతలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు శ్రీనివాసరెడ్డి, శేషు రమేష్, సాయి, రెహెమాన్, సుబ్బరాయుడు, శ్రీనివాసులు, బాబు, సుజీవ్, సంఘ పెద్దలు, యువకులు, రైతులు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక


నాటి గురువులతో పూర్వవిద్యార్థులు

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఎప్పుడో 20ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న విద్యార్థుల అపూర్వ సమ్మేళన కార్యక్రమం కొలిమిగుండ్లలోని జడ్పీ ఉన్నతపాఠశాలలో జరిగింది. పాఠశాలలో 2004-2005 సంవత్సరంలో 10వ తరగతి విద్యనభ్యసించిన విద్యార్థులు శుక్రవారం కలుసుకొని ఒకరికొకరు తమ అప్యాయతలను పంచుకున్నారు. గురువులు వైవీఎస్ నారాయణరెడ్డి, బాలసుబ్బారెడ్డి, విజయప్రసన్న, రాఘవేంద్రప్రసాద్, హుసేనయ్యను సన్మానించారు. తమవంతుగా పాఠశాలకు రూ.70వేలు వెచ్చించి రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టారు.

తూతూ మంత్రంగా మండల సమావేశం

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ నాగవేణి ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సమావేశాన్ని తూతూ మంత్రంగా ముగించారు. అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పెద్దగా హాజరు కాకపోవడంతో ప్రారంభమైన గంటకే ముగించారు. సమావేశంలో ఎంపీడీవో ప్రసాదరెడ్డి, తహసీల్దార్ బాల ఈశ్వరరెడ్డి, వ్యవసాయాధికారి భూమాజ్యోతి, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా మహన్యాస రుద్రాభిషేకం

చాగలమర్రి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలపాడు, చాగలమర్రి గ్రామాల్లో గల కన్యకాపరమేశ్వరి ఆలయంలో వేద పండితుల ఆధ్వర్యంలో శుక్రవారం మహన్యాస రుద్రాభిషేకం, గణపతి హోమం, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లక్ష్మణబాబు, అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి నవతాప్రసాద్, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే విజ్ఞాన అభివృద్ధి

డోన్ రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతోనే విజ్ఞాన అభివృద్ధి సాధ్యమని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి అన్నారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో 'పుస్తకాలు పిలుస్తున్నాయి' కార్యక్రమాన్ని నిర్వహించారు. పుస్తక వారోత్సవాల్లో భాగంగా చేపట్టిన కార్యక్రమం ఉద్దేశించి శాస్త్రీయ విజ్ఞానంతోనే దేశ అభివృద్ధి ముడిపడి ఉందన్నారు. అనంతరం పుస్తకావిష్కరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వెంకటసుబ్బారెడ్డి, నరసింహులు, జన విజ్ఞాన వేదిక సభ్యులు సర్వజ్ఞ మూర్తి ఉన్నారు.

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

బేతంచెర్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.పెండేకల్ గ్రామానికి చెందిన ఎల్లస్వామి (37) అనే ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో ఫజిల్ రెహిమాన్, ఏపీవో విజయరాణి, ఉపాధి సిబ్బంది పెండేకల్లు గ్రామానికి వెళ్లి ఎల్లస్వామి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ గ్రామానికి వెళ్లి ఎల్లస్వామి మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేశారు.

'రైతుకు న్యాయం చేయాలి'

ప్యాపిలి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బాధిత రైతుకు న్యాయం చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా హేమసుందర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని పొతుదొడ్డి గ్రామానికి చెందిన లక్ష్మిరెడ్డికి 82-1ఏ1లో సర్వే నెంబరులో 3.20 ఎకరాల పొలం ఉందన్నారు. ఆర్థిక ఇబ్బందుల వలన పొలాన్ని విక్రయించాడన్నారు. రిజిస్ట్రేషన్ చేయడానికి వెళ్లగా వెబ్ ల్యాండ్‌లో సర్వే నెంబరు గల్లందని ఆయన ఆరోపించారు. వెబ్ ల్యాండ్‌లో సర్వేనెంబరు ఎక్కించాలని రోజుల తరబడి తిరిగిన అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. వెంటనే రైతు లక్ష్మిరెడ్డికి న్యాయం చేయాలని లేనిపక్షంలో సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ఉలికిపాటు..

● శివారు ప్రాంతాల్లో వరుస చోరీలు
● బెంబేలెత్తిస్తున్న దొంగలు
● నిద్రావస్థలో పోలీసులు

డోన్ రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు ప్రాంతాల్లో వరుస దొంగతనాలు చోటు చేసుకోవడంతో స్థానికులు బిక్కుబిక్కుమంటున్నాయి. దొంగలు శివారు ప్రాంతాలను ఎంచుకోవడం వల్ల ఆందోళన వ్యక్తమవుతుంది. డోన్ అతిపెద్ద రైల్వేజంక్షన్ కావడంతో ప్రతిరోజూ వచ్చే రైళ్ల రాకపోకల్లో గుర్తు తెలియని దుండగులు, కొత్త వ్యక్తులు డోన్ ప్రాంతంలో దిగి శివారు ప్రాంతాలను టార్గెట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. డోన్ పట్టణం రైల్వేస్టేషన్‌కు సమీపంలో గుత్తి రోడ్డులో నూతనంగా నిర్మించిన వంద పడకల ఆసుపత్రి గత ఆరునెలల కిందట ప్రారంభమైంది. రోగుల బంధువులు తిండిపదార్థాలకు డోన్‌లోకి రావాలన్నా జంకుతున్న పరిస్థితి నెలకొంది. గత రెండు నెలల క్రితం చిగురుమానుపేటకు చెందిన మస్తాన్‌వలి అనే వ్యక్తి మోటారు బైక్‌పై జారీ కింద పడ్డాడు. ఆసుపత్రిలో చికిత్సకు వెళ్లి అనంతరం ఇంటికి చేరుకున్న బాధితుడు తన మెడలో ఉన్న బంగారు చైన్ మాయమవడంపై తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అలాగే పట్టణ పాతపేట సమీపంలో ఉన్న రామచంద్రమాలిక్ బాబా ఆలయంలో సాయి భక్తులు రాత్రి నిద్రించడానికి వస్తుంటారు. మాలిక్‌బాబా ఆలయం ప్రాంగణంలో భక్తులు నిద్రించే సమయంలో గుర్తు తెలియని దుండగులు భక్తుల ఒంటిపై ఉన్న వెండి పట్టీలు, గొలుసులు దొంగిలించే ప్రయత్నం చేస్తున్నారని ఓ సాయి భక్తుడు ఆవేదన వ్యక్తం చేశాడు. పట్టణ సమీప పరిసరాల్లో పోలీసుల గస్తీ లేకపోవడంతో తరుచుగా దొంగతనాలు జరుగుతున్నాయని, వీటిపై బాధితులు పోలీస్ స్టేషన్‌లో పెద్దగా ఫిర్యాదులు చేయకపోవడంపై దొంగల బెడద అధికమవుతుందని స్థానికులు వాపోతున్నారు.


డోన్ రైల్వే స్టేషన్

పోలీసుల గస్తీ పెంచాలి



పట్టణ శివారు ప్రాంతాల్లో పోలీసుల గస్తీని పెంచాలి. రాత్రి పోలీసుల బీట్లను చేసి శివారు ప్రాంతాలపై దృష్టి సారించాలి. ప్రజల సొమ్ముకు, ప్రజలకు భద్రత కల్పించాలి.

- ఎల్.శివప్రకాష్, కొత్త పేట, డోన్

శివారు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా



పట్టణ శివారు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెట్టాం. కొత్తగా వచ్చే వారి కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. శివారు ప్రాంతంలో చిన్నపాటి దొంగతనం జరిగినా పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేయాలి.

- ఇంతియాజ్ బాషా, పట్టణ సీఐ, డోన్

పట్టణాభివృద్ధికి కృషి చేస్తాం


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

డోన్ టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణాభివృద్ధే ధ్యేయంగా పని చేస్తామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. సమావేశంలో పురపాలక సంఘం, మున్సిపల్ పార్కులకు 40 వాట్ల సోలార్ ఎల్ఈడీ లైట్లు, పార్కులో జిమ్స్, పిల్లల ఆట పరికరాలు, ఫ్లైఓవర్ కింద దుకాణాల ఏర్పాటు కోసం రూ.1.60కోట్లు నిధులు మంజూరు మంజూరైనట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా పట్టణంలోని వీధి కుక్కలకు టీకాలు వేయించేందుకు ఆదేశాలు వచ్చాయని తెలిపారు. రూ.99వేల సాధారణ నిధుల నుంచి ఖర్చు చేసేందుకు కౌన్సిల్ ఆమోదించిందన్నారు. సమావేశంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

రీ సర్వే పనులు పకడ్బందీగా చేపట్టాలి

బనగానపల్లె, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో వచ్చేనెల 1నుంచి నిర్వహించనున్న రీసర్వే పనులు పకడ్బందీగా నిర్వహించాలని డోన్ ఆర్‌డీవో నరసింహులు ఆదేశించారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయంలో సర్వేయర్లు, వీ ఆర్‌వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మే 1నుంచి మండలంలోని యాగంటిపల్లె తిమ్మాపురం గ్రామాల్లో రీసర్వే ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సర్వేయర్లు, గ్రామ వీఆర్‌వోలు కలసికట్టుగా రీసర్వే పనులు చేపట్టాలని కోరారు. సమావేశం లో బనగానపల్లె, కోవెలకుంట్ల, అవుకు తహసీల్దార్లు నారాయణరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, మల్లికార్జున్ పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకంపై సబ్సిడీలు

బనగానపల్లె, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పండ్ల తోటల పెంపకంపై ప్రభుత్వం జాతీయ ఉపాధిహామీ పథకం కింద సబ్సిడీ అందిస్తోందని , సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి కోరారు. శుక్రవారం బనగానపల్లె పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రమణ అధ్యక్షతన జాతీయ ఉపాధిహామీ, వ్యవసాయశాఖ అసిస్టెంట్లు, హార్టికల్చర్ సిబ్బందికి పండ్ల తోటల పెంపకంపై , జాతీయ ఉపాధిహామీ సబ్సిడీ పథకాలను గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో ఉపాధి సిబ్బంది, హార్టికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడి అమానుషం



ఆళ్లగడ్డలో నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

డోన్ టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మారువేషాల్లో అమాయకుల ప్రాణాలు బలితీసుకున్న ఉగ్రవాదుల పిరికిపంద చర్యలను ఖండిస్తున్నామని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త గడ్డం బ్రహ్మం అన్నారు. శుక్రవారం ఉగ్రవాదుల చేతుల్లో ప్రాణాలు కోల్పోయిన పర్యాటకుల ఆత్మకు శాంతి చేకూరాలని జనసేనాని పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు మూడోరోజు పట్టణంలోని గాంధీ సర్కిల్‌లో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమాయకుల ప్రాణాలు బలితీసుకున్నంత మాత్రాన జాతి సమైక్యతను దెబ్బతీయలేరన్నారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు పరదేశీ మహేష్, హుశేనాపురం జగదీష్, పుల్లయ్య, జయచంద్ర, శివాజీ, సతీష్, మహేంద్ర, మధు, పీఎస్‌పీకే ప్రసాద్, ఆర్య, జమాల్, ప్రతాప్ పాల్గొన్నారు. అలాగే యూటీఎఫ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వెంకట సుబ్బారెడ్డి, జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి మాణిక్యం శెట్టి, జిల్లా గౌరవాధ్యక్షులు సుబ్బరాయుడు, జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి , నాయకులు పాల్గొన్నారు.

సంజామల: మండలంలోని నొస్సంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు పట్టుకొని నిరసనలు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గుర్రాల చిన్నయ్య యాదవ్, టీడీపీ నాయకుడు గాధం శెట్టి వెంకటేశ్వర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బనగాన పల్లె: కశ్మీర్‌లో ఉగ్రవాదులు దాడులు చేయడం అమానుషమని బనగానపల్లె న్యాయవాదులు విమర్శించారు. ఉగ్రవాదుల దాడికి నిరసనగా శుక్రవారం బనగానపల్లె బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖాజాహుసేన్, కార్యదర్శి శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో కోర్ట ఆవరణంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: ఉగ్రదాడికి నిరసనగా పట్టణంలో ముస్లిం సంఘం నాయకులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఖాజీ మహమ్మద్ జాఫర్ సాధిక్, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అమీర్‌బాష, పెద్దలు, ముస్లింలు పాల్గొన్నారు.

అహోబిలేశుడి సన్నిధిలో విదేశీ భక్తులు


అహోబిలేశుని దర్శించుకున్న రష్యన్ భక్తులు

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో జరుగుతున్న శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి వసంతోత్సవాలలో శుక్రవారం రష్యా దేశానికి చెందిన విదేశీ భక్తులు పాల్గొన్నారు. విదేశీ పర్యాటకులు సాంప్రదాయ దుస్తులు ధరించి స్వామివారిని, అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వారికి స్వామివారి హారతి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనతరం ఎగువ అహోబిలం క్షేత్రంలో కూడా విదేశీ భక్తులు శ్రీ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

వాహనదారులకు లైసెన్స్ తప్పనిసరి

దొర్నిపాడు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్ ఆర్సీ కలిగి ఉండాలని ఎస్ఐ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం దొర్నిపాడు ఆర్అండ్‌బీ రోడ్డుపై వాహనాల తనిఖీ చేపట్టారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

కోవెలకుంట్ల : అధిక లోడుతో వాహనాలు వెళ్తే కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పాండురంగస్వామి గుడి వద్ద అధిక లోడుతో వెళ్తున్న వాహనాన్ని ఆపి డ్రైవరుపై కేసు నమోదు చేశారు.

మేకల దొంగలు అరెస్టు

బనగానపల్లె, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మేకల దొంగతనం కేసులో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య శుక్రవారం తెలిపారు పాణ్యం గ్రామానికి చెందిన దేవరకొండ సురేశ్, కోనేటి సాయి వెంకట్, అచ్చుకట్ల అక్బర్‌వలి, బీరేలి నాగరాజు అనే వ్యక్తులను నందవరం శివారులోని సదానందాశ్రమం వద్ద అరెస్టు చేసి మేకలను ఆటోను సీజ్ చేశామని ఎస్ఐ తెలిపారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

కోవెలకుంట్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా రవాణా సమస్యలపై శనివారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజరు ఒక ప్రకటనలో తెలిపారు. కోవెలకుంట్ల డిపో పరిధిలో ఏవైనా సమస్యలు, ఫిర్యాదులు ఉంటే సెల్‌నెంబరు 9959225798 తెలపాలని కోరారు. ఈ అవకాశాన్ని డిపో పరిధిలోని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కౌలు వేలంలో రూ.12.65 లక్షల ఆదాయం

రుద్రవరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలమూరు గ్రామంలో ఈశ్వర చెన్నకేశవ దేవాలయ భూములకు శుక్రవారం కౌలు వేలం ఈవో సాయి జయచంద్రా రెడ్డి నిర్వహించారు. వేలంలో ప్రభుత్వానికి రూ.12.65లక్షలు ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో పీటీ నారాయణ, చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడు పత్తి బ్రహ్మయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పాడిగేదెతో సిరులు

రుద్రవరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పాడి గేదె ఉన్న ఇంట్లో సిరులు ఉన్నట్లేనని ఎంపీడీవో భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం రుద్రవరంలోని పశువైద్యశాలలో పశువైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్ ఆధ్వర్యంలో ప్రపంచ పశు వైద్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పాడిగేదెల్లో, వృషభాల్లో యాజమాన్య పద్ధతులు వాటి సంరక్షణపై వివరించారు. ఒక పాడి గేదె ఒక ఎకరా భూమితో సమానమని వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

18 నీటి తొట్ల మంజూరు

చాగలమర్రి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో పశువుల దాహార్తి తీర్చేందుకు ఈ ఏడాది ఉపాధిహామీ పథకం ద్వారా నీటి తొట్లు ఏర్పాటు చేస్తున్నామని ఏపీవో ఖాసీం తెలిపారు. శుక్రవారం ఉపాధి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 18 గ్రామ పంచాయతీలకు నీటి తొట్లను మంజూరు చేశామని అన్నారు. ఆయా గ్రామాల్లో నీటి తొట్ల పనులను వేగవంతం చేశామని అన్నారు.

వడదెబ్బ సోకకుండా జాగ్రత్త పడాలి

చాగలమర్రి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు పశువులకు వడదెబ్బ సోకకుండా జాగ్రత్త పడాలని పశుసంవర్ధకశాఖ ఏడీ వర్రప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక పశువైద్య కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు ఎండలు పెరిగిపోతున్నాయన్నారు. జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జగదుర్తి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తున్నందు వెల్దుర్తి 33కేవీ ఫీడర్ లైన్ షిఫ్ట కారణంగా శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యా హ్నాం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని డిప్యూటీ ఎగ్జి క్యూటీవ్ ఇంజనీర్ నాగేంద్ర శుక్రవారం తెలిపారు. అలాగే జగదుర్తి సబ్‌స్టేషన్ పరిధిలోని రైతులకు ఇవ్వాల్సిన త్రీఫేస్ కరెంటు రాత్రి 3 నుంచి ఉదయం 7గంటల వరకు, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు.

బేతంచెర్ల: పట్టణంలో శనివారం 3గంటల పాటు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీ మధుసూదన్ రెడ్డి, టౌన్ ఏఈ పుల్లయ్య శుక్రవారం తెలిపారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్ నుంచి సత్రం వరకు విద్యుత్ స్థంభాల మరమ్మతుల కారణంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, ప్యాక్టరీ యజమానులు సహకరించాలని కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

సంజామల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సాల్మాన్ శుక్రవారం తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఎంపీపీ పోచా రమాదేవి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపీటీసీ, సర్పంచ్‌లు, మండల కోఆప్షన్ సభ్యులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

ఘనంగా నందవరంలో పల్లకీ సేవ

బనగానపల్లె, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందవరం చౌడేశ్వరి మాత ఆలయంలో శుక్రవారం ఘనంగా పల్లకీసేవ కార్యక్రమాలు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈవో కామేశ్వరమ్మ, చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఊయలసేవ, సహస్ర దీపాలంకరణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లు సస్పెన్షన్

బనగానపల్లె, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లను సస్పెండ్ చేసినట్లు ఏపీవో ప్రతాప్ శుక్రవారం తెలిపారు. తిమ్మాపురం, రామకృష్ణాపురం ఫీల్డ్ అసిస్టెంట్లు చాకలి శేఖర్, మహేశ్ చౌదరిని డ్వామా పీడీ వెంకటసుబ్బయ్య సస్పెండ్ చేసినట్లు తెలిపారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

పిచ్చికుక్క దాడిలో నలుగురికి గాయాలు

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పట్టణం శివారులోని వీవర్స్ కాలనీలో శుక్రవారం పిచ్చి కుక్క దాడి చేయడంతో నలుగురికి గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరు చిన్నపిల్లలు కూడా ఉన్నారు. మంచంపై నిద్రిస్తున్న ఒక వృద్ధుడిపై కూడా కుక్క దాడి చేసింది. దీంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. కాలనీకి చెందిన కొందరు యువకులు పిచ్చి కుక్కను కర్రలతో కొట్టి చంపివేశారు.

అప్రమత్తంగా ఉండాలి

● మలేరియా సబ్ యూనిట్ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు
● మండలాల్లో అవగాహన ర్యాలీలు

బేతంచెర్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు మలేరియా వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆర్ఎస్ రంగాపురం డాక్టర్ అబ్దుల్‌ఆలీం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మలేరియా చలి వణుకుతో కూడిన జ్వరం రావడం కొన్ని సందర్భాల్లో ప్రాణాంతకంగా మారుతుందన్నారు. కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కోల్పోయ్యే పరిస్థితులు ఏర్పడుతాయన్నారు. ప్రజలు తగ్గు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎస్ స్వర్ణమాంజరి, ఎంపీహెచ్ఈవో అబ్దుల్ గఫార్, సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డోన్ రూరల్: దోమకాటుకు గురికాకుండా దోమ తెరలు వాడాలని కొత్తబురుజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డా.శ్రీకాంత్, హెల్త్ సూపర్‌వైజర్ కే.చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకుని గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కొత్తబురుజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

కోవెలకుంట్ల : ప్రతి ఒక్కరూ వారానికి ఒకసారి ఫ్రైడే డ్రైడేను పాటించాలని వైద్యులు తెలిపారు. పట్టణంలో సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుజాత, మాయలూరు వైద్యాధికారి డాక్టర్ రాబర్ట్ కెన్నెడీ ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసరు విశ్వనాథ్, మలేరియా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసరు గిరిజ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

రుద్రవరం : మండలంలోని నరసాపురం గ్రామంలో వైద్యాధికారి బాబు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం వైద్యులు అంజలి, వైద్య సిబ్బంది, ఆశాలు కలిసి అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ నాయక్, వైద్య సిబ్బంది సత్యనారాయణరాజు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

శిరివెళ్ల: మలేరియా వ్యాధిని అంతం చేయడం మనతోనే సాధ్యమవుతుందని పీహెచ్‌సీ వైద్యుడు ముఖేష్, సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బందితో కలిసి పీహెచ్‌సీ నుంచి శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రవి కుమార్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: మలేరియా అంతం మనతోనే సాధ్యమని వైద్యాధికారి నరసింహా అన్నారు. శుక్రవారం పట్టణంలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి దస్తగిరి రెడ్డి, సబ్‌యూనిట్ అధికారి శివచంద్రారెడ్డి, సూపర్‌వైజర్ శాంతి, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



రంగాపురంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



చాగలమర్రిలో ర్యాలీ చేస్తున్న వైద్యులు, ఏఎన్ఎంలు



శిరివెళ్లలో ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, ఏఎన్ఎంలు